ప్రతి నిత్యం తాజా వార్తలతో నిజాలు నిగ్గు తేలుస్తూ, సమకాలీన అంశాలను విశ్లేశిస్తూ ముస్తాబయి మీ ముందుకు వస్తున్న అక్షరం తెలుగు దినపత్రిక
సుఫల అక్షరం
తెలుగు దినపత్రిక సామాన్యుడి అస్త్రం
Your Ad Here.
ప్రకటనలకు (అడ్వర్టైస్‌మెంట్) కొరకు సంప్రదించండి
EDITOR & PUBLISHER: 9391690609, OFFICE: 7893003409.
aksharamtsnews@gmail.com .... www.aksharamtelugudaily.com

www.aksharamtelugudaily.com RNI NO: TELTEL/2018/75419

# సుఫల అక్షరం

సామాన్యుడి అస్త్రం తెలుగు దినపత్రిక

SUPHALA AKSHARAM

## తమిళనాట అనూహ్య రాజకీయ పరిణామాలు

- సిఎం విజయ్‌తో వైకో భేటీతో ఊహాగానాలు
- డిఎంకెను వీడుతారన్న ప్రచారం

➢ 11వ పేజిలో..

FRIDAY 19TH JUNE 2026 EDITOR : SHAIK YACOOB PASHA PAGES : 12 VOLUME : 09 ISSUE : 93 COST : 3\- KHAMMAM, TELANGANA

శుక్రవారం 19 జూన్ 2026 ఎడిటర్ : షేక్ యాకూబ్ పాషా పేజీలు : 12 సంపుటి : 09 సంచిక : 93 వెల : రూ.3/- ఖమ్మం, తెలంగాణ

CIRCULATED BY : ADILABAB,, A SIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULABMA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOODNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRICILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI

## మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- ఉర్దూ అకాడమీ గోల్డెన్ జూబ్లీ వేడుకల సందర్భంగా ముషాయిరా
- వేగంగా రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణం
- కొత్త స్మశాన వాటికల స్థల సేకరణపై కలెక్టర్లకు ఉత్తర్వులు
- డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడి
- సమావేశానికి హాజరైన మంత్రి హజారుద్దీన్ కార్పొరేషన్ చైర్మన్లు



హైదరాబాద్,జూన్ 18 : రాష్ట్రంలోని మైనార్టీల సామాజిక, ఆర్థిక, విద్యాభివృద్ధికి తమ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఇందుకోసం బడ్జె ట్‌లో భారీగా నిధులను కేటాయించామని, వాటికి సంబంధించిన అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన వేగవంతం చేస్తున్నామని ఆయన వెల్లడించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర

➢ మిగతా 2వ పేజిలో..

## నెత్తురోడిన రాష్ట్ర రహదారులు

- వేర్వేరు ప్రమాదాల్లో 8మంది మృతి
- మేడ్చెల్ వద్ద ప్రమాదంలో ముగ్గురు మృతి
- వరంగల్ రహదారి ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం

హైదరాబాద్,జూన్18 రాష్ట్రంలోని రహదారులు నెత్తురోడాయి. వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఎనిమిది మంది మృతి చెందారు. హైదరాబాద్ - వరంగల్ జాతీయ రహదారిపై మినీ ట్రక్కును లారీ ఢీ కొట్టిన ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఇద్దరు మృతి చెందారు. ఎస్సై బండి శ్రవణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. దేవరుప్పుల మండలంలో కిరాణా దుకాణం నిర్వహించే జాట్ రోహిత్, యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం బండ కొత్తపల్లికి చెందిన మధు.. టాటా ఏస్ మినీ ట్రక్కులో హైదరాబాద్ నుంచి కిరాణా సామగ్రి తీసుకొస్తుండగా.. తెల్లవారుజామున జనగామ జిల్లా లింగాలఘనపూర్ మండలం నెల్లుట్ల సమీపంలోకి రాగానే ట్రక్కు టైరు పంక్చర్ అయింది. అదే దారిలో వెళ్తున్న లారీని ఆపి జాకీ తీసుకున్నారు. లారీ క్లీనర్ రాజేందర్, ట్రక్కు డ్రైవర్ మధు, కిరాణా దుకాణ యజమాని రోహిత్.. పంక్చర్ అయిన టైరును మారుస్తున్న క్రమంలో వెనుక నుంచి మరో లారీ వేగంగా వచ్చి ఢీ

➢ మిగతా 2వ పేజిలో..

## 26 నుంచి 28 వరకు రిజిస్ట్రేషన్ సేవలకు విరామం

- రిజిస్ట్రేషన్ సర్వర్ నిర్వహణ పనులు
- జూన్ 29 నుంచి యథావిధిగా సేవలు




హైదరాబాద్,జూన్ 18 స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించిన వెబ్‌సైట్‌తో పాటు అనుబంధ ఆన్‌లైన్ సేవలు షెడ్యూల్ చేసిన సర్వర్ నిర్వ హణ పనుల కారణంగా ఈ నెల 26 నుంచి 28 వరకు తాత్కాలికంగా అందుబాటులో ఉండవని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంత తెలిపారు. ÷ఎమారు ఐదేళ్ల తర్వాత

➢ మిగతా 2వ పేజిలో..



## ఆర్టీసీ ఉద్యోగులకు శుభవార్త

- 11శాతం ఫిట్‌మెంట్ అమలుకు నిర్ణయం
- జూలై 1 నుంచే అమలు చేస్తామన్న మంత్రి పొన్నం

హైదరాబాద్,జూన్18 తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులకు మంత్రి పొన్నం ప్రభాకర్ శుభవార్త చెప్పారు. ఆర్టీసీ సమ్మెలో ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగులకు జులై 1 నుంచి 11 శాతం ఫిట్‌మెంట్ అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆర్టీసీ గుర్తింపు సంఘాల ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ఆదేశాలు జారీ చేశారు. గురువారం టీజీఎస్‌ఆర్టీసీ ఉన్నతాధికారులతో మంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ.. నాగర్ కర్నూల్, పెద్దపల్లి బస్ డిపో పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. వేములవాడ, కథలాపూర్ బస్ స్టేషన్లకు త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. హుజూర్‌నగర్, కోదాడ, నాగర్‌కర్నూల్ బస్ స్టేషన్లకు కూడా మంత్రి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ములుగు బస్ స్టేషన్ నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. మహాలక్ష్మి పథకంపై ప్రత్యేక అధ్యయనం చేయాలని

➢ మిగతా 2వ పేజిలో..

## 30న రైతు భరోసా నిధులు విడుదల

- వానాకాలం సాగుకు రైతులకు అండగా ప్రభుత్వం
- మధిర వేదికగా సిఎం రేవంత్ చేతుల మీదుగా అందచేత
- ఏడు రకాల సన్నాలకు బోనస్ ఇవ్వాలని నిర్ణయం
- కేబినేట్ భేటీలో పలు అంశాలపై చర్చ
- వివరాలు వెల్లడించిన మంత్రి ఉత్తమ్ కుమార్




హైదరాబాద్,జూన్18 ఈనెల 30వ తేదీన రైతు భరోసా నిధులు విడుదల చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. గురువారం సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సమావేశమైంది. ఈ సమావేశంలో ఈ మేరకు కేబినెట్ నిర్ణయం తీసుకుంది. వరుసగా తొమ్మిది రోజుల పాటు రైతుల ఖాతాల్లో ప్రభుత్వం ఈ నిధులను జమ చేయనుంది. 30న ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మధిరలో నిర్వహించే సభలో సీఎం రేవంత్ రెడ్డి ఈ నిధులను విడుదల చేయనున్నారు. రైతు భరోసా కింద రైతులకు ప్రభుత్వం ఏటా ఎకరానికి రూ.12 వేల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తోంది. ఈ పెట్టుబడి సాయాన్ని రెండు పంటల కాలాలకు ఖరీఫ్, రబీ కాలంలో విడగొట్టి, ప్రతి సీజన్‌కు ఎకరాకు రూ. 6,000 చొప్పున నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోంది. మరోవైపు.. 23వ ప్రధాన మంత్రి కిసాన్ యోజన పథకం సంబంధిత నిధులను కేంద్రం ఈ నెల 20న విడుదల చేయనుంది. పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లాలోని తారకేశ్వర్‌లో జరిగే కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ నిధులను విడుదల చేయనున్నారు. దీంతో ఒక్కో రైతు ఖాతాలో రూ. 2 వేలు చొప్పున నగదు జమ కానుంది. దీంతో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు 10 రోజుల

➢ మిగతా 2వ పేజిలో..

## రామగుండం ఎరువులు మనకే కేటాయించాలి

- కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు ఢిల్లీ వెళతాం
- ఒక్క మొక్కజొన్న గింజకూడా కొనని కేంద్రం
- రైతుబీమా పథకం కింద ఎల్ఐసికి బీమా మొత్తం చెల్లింపు
- మంత్రి తుమ్మల నాగేశ్వర రావు వెల్లడి



హైదరాబాద్,జూన్ 18 రామగుండం ఎరువులు పొందేలా కేంద్ర ప్రభుత్వంపై ఉద్యమిస్తా మని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానిం చారు. ప్రతి నెల రెండు లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఇస్తామని అన్నారని.. కానీ హామీ ఇచ్చిన మేరకు కేంద్రం యూరియా సరఫరా ఎందుకు చేయట్లేదని ప్రశ్నించారు. గురువారం సచివాలయంలో మీడియాతో మంత్రి తుమ్మల మాట్లాడారు. ఢిల్లీకి వెళ్లి సరిపడా యూరియా తెలంగాణకు ఇవ్వాలని కేంద్రాన్ని కోరుతామని పేర్కొన్నారు. కేంద్రం ఎంఎస్పీ ప్రకటించి కొనుగోలు నుంచి తప్పుకుంటుందని మంత్రి తుమ్మల విమర్శించారు. ఒక్క గింజ మొక్కజొన్నని కూడా కేందప్రభుత్వం

➢ మిగతా 2వ పేజిలో..



## ప్రభుత్వ భూముల కబ్జా నిరోధానికే హైడ్రా

- పేదల జోలికి వెళ్లకుండా..కబ్జాదారుల భరతం పడుతోంది
- హైదరాబాద్ కాలుష్యం నివారించేందుకే వనమహోత్సవం
- ఎవరు అడ్డుపడ్డా మూసీ ప్రక్షాళన కొనసాగుతుంది
- గుర్రంగూడ ఎకో పార్క్‌లో వనమహోత్సవం
- మొక్కను నాటి ప్రసంగించిన సిఎం రేవంత్ రెడ్డి

➢ మిగతా 2వ పేజిలో..

## పవన్ కళ్యాణ్‌పై ఎందుకు కేసు పెట్టలేదు

- కెటిఆర్ సిరిసిల్లకు విజిటింగ్ టూరిస్ట్
- టిఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత విమర్శలు



కరీంనగర్,జూన్ 18 ప్రాంతీయవాదాన్ని వేర్పాటు వాదంతో పోల్చిన ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పై రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు కేసు పెట్టలేదని తెలంగా ణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కవిత ప్రశ్నిం చారు. కేసు పెట్టడం చేతగాని ప్రభుత్వం తెలంగాణ లో ఉందని విమర్శించారు. కరీంనగర్‌లో తెలంగాణ రక్షణ సేన జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్టీ రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె మాట్లాడారు. తెలంగాణ

➢ మిగతా 2వ పేజిలో..

## 30న రైతు భరోసా నిధులు విడుదల

తేడాతో రైతుల ఖాతాల్లో నగదు జమ చేయనున్నాయి. సచివాలయంలో మంత్రులతో ప్రత్యేకంగా నిర్వహించిన సమావేశంలో పలు అంశాలపై సీఎం చర్చించారు. హైదరాబాద్ మెట్రో రైలు, ధాన్యం కొనుగోళ్లు, వీబీజీ రాంజీ పథకం, కేంద్ర ప్రభుత్వ వైఖరి తదితర అంశాలపై మంత్రులతో చర్చలు జరిపారు. వానాకాలం రైతు భరోసా నిధులు విడుదల చేయాలని నిర్ణయం తీసుకున్నామని భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. జూన్ 30వ తేదీన మధిరలో రైతు సమ్మేళనం పేరిట నిర్వహించే బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి రైతు భరోసా నిధులు విడుదల చేస్తారని తెలిపారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకర్ల సమావేశంలో వివరించారు. ఏడు రకాల సన్నాలకు బోనస్ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. మార్కెట్లో వాటికి ఉన్న డిమాండ్ మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. మన రాష్ట్రం నుంచి కేంద్రం తక్కువ ధాన్యం సేకరించడంపై ఈ సమావేశంలో ఆందోళన వ్యక్తమైందని పేర్కొన్నారు. మొత్తం ధాన్యం కొనుగోలు చేయాలని ఈ సందర్భంగా కేంద్రాన్ని డిమాండ్ చేశామని తెలిపారు. కేంద్రం కనీస మద్దతు ధర ఇచ్చి కొనే ధాన్యాన్ని మాత్రమే తెలంగాణ కొనాలని నిర్ణయించామన్నారు. ఎరువుల కోటాను వెంటనే విడుదల చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఇదే అంశంపై పలుమార్లు కేంద్రానికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖలు రాశారని గుర్తు చేశారు. త్వరలో ఢిల్లీకి వెళ్లి ఆయా అంశాలను కేంద్రానికి విజ్ఞప్తి చేయాలని నిర్ణయించామన్నారు. రామగుండంలో తయారయ్యే యూరియాలో అత్యధిక శాతాన్ని తెలంగాణకే కేటాయించాలని కేంద్రానికి స్పష్టం చేశారు. అలాగే హైదరాబాద్ మెట్రో విస్తరణకు కూడా సహకరించాలని కేంద్రాన్ని కోరారు. అందుకు మెట్రో రెండో దశకు అనుమతి ఇవ్వాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఐఆర్ఎఫ్‌సీ నుంచి రావాల్సిన రుణాన్ని వెంటనే విడుదల చేయించాలని కేంద్రాన్ని కోరుతున్నట్లు తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి అడ్డంకులు లేకుండా ప్రాజెక్టుల అనుమతులు ఇప్పించడానికి కలిసి రావాలని బీజేపీ ఎంపీలకు ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ పిలుపునిచ్చారు. ఇకపై డిజిటల్ క్యాబినెట్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. జూన్ 21వ తేదీన జరిగే నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని ఈ కేబినెట్ భేటీలో నిర్ణయించినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ఇక వీబీ- జీ ఆర్‌ఏఎం జీ పై కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ సబ్ కమిటీలో మంత్రులు సీతక్క, తుమ్మల, ఉత్తమ్ ఉంటారు. దీనిపై ఇతర రాష్టాల్లో అధ్యయనం తర్వాత.. జూన్ 25 లోపు ప్రభుత్వానికి కేబినెట్ సబ్ కమిటీ నివేదిక అందజేయనుందని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు.

## పార్టీ లైన్ దాటితే క్షమించేది లేదు

హైదరాబాద్,జూన్18 ఎంతటి వారైనా సరే వారి వ్యక్తిగత సమస్యలను పార్టీపై రుద్ద వద్దని నేతలకు క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపీ మల్లు రవి స్పష్టం చేశారు. మీకు ఏమైనా సమస్యలు ఉంటే.. వాటిని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ లేకుంటే రాష్ట్ర వ్యవహారాల బాధ్యురాలు మీనాక్షి నటరాజన్ దృష్టికి తీసుకెళ్లాలని నేతలకు ఆయన సూచించారు. గురువారం గాంధీ భవన్‌లో మల్లు రవి విలేకర్లతో మాట్లాడుతూ.. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ క్రమశిక్షణ కమిటీ ముందు హాజరవుతారన్నారు. కామారెడ్డిలో ఒకరిపై మరొకరు ఫిర్యాదు చేసుకున్నారని వివరించారు. షబ్బీర్ ఆలీకి నోటీసులు జారీ చేశామని చెప్పారు. ఆదివారం కమిటీ ముందు హాజరు కావాలని ఆయనకు సూచించామన్నారు. అందుకు షబ్బీర్ అలీ సానుకూలంగా స్పందించారని తెలిపారు. ముందుగా షబ్బీర్ ఆలీ ఇచ్చిన ఫిర్యాదుపై క్రమశిక్షణ కమిటీ చర్చిందన్నారు. ఇరు పక్షాల వాదనలు విన్న తర్వాత తమ నిర్ణయం ప్రకటిస్తామని మల్లు రవి వెల్లడించారు. పార్టీ వ్యతిరేకంగా ఎవరు ప్రవర్తించిన క్రమశిక్షణ కమిటీ చూస్తూ ఊరుకునే ప్రసక్తి లేదని నేతలకు ఎంపీ మల్లు రవి వార్నింగ్ ఇచ్చారు. పార్టీ క్రమశిక్షణ చైర్మన్, ఎంపీ మల్లు రవిని కలిసి అన్ని విషయాలు వివరించానని కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ చంద్రశేఖర్ రెడ్డి వెల్లడించారు. నోటీసులపై లిఖిత పూర్వక సమాధానం ఇచ్చానన్నారు. అన్ని విషయాలు పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని ఆయన్ని కోరినట్లు చెప్పారు. వారం రోజుల్లో అన్ని అంశాలు పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని మల్లు రవి తెలిపారని చెప్పారు. కమిటీ ఏ నిర్ణయం తీసుకున్నా అందుకు కట్టుబడి ఉండాలని ఆయన సూచించారని వివరించారు.

## ఆర్టీసీ ఉద్యోగులకు శుభవార్త

సూచించారు. మహిళా సంఘాలకు చెందిన 553 బస్సుల పనితీరుపై మంత్రి నివేదిక కోరారు. రాష్ట్రంలో 1,050 ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణపై సమగ్ర నివేదిక అందించాలని ఆదేశించారు. ఆర్టీసీ వద్ద 10,173 బస్సులు.. 38,128 మంది ఉద్యోగులు ఉన్నారని, రోజుకు 61 లక్షల మంది ప్రయాణికులు టీజీఎస్‌ఆర్టీసీ సేవలు పొందుతున్నట్లు తెలిపారు. పెండింగ్ కారుణ్య నియామకాలను వెంటనే పూర్తి చేయాలని అధికారులను పొన్నం ఆదేశించారు. తొలగించిన ఉద్యోగుల్లో 244 మందికి ఇప్పటికే విధుల్లోకి అవకాశం ఇచ్చినట్లు తెలిపారు. ఉద్యోగి శంకర్ కుటుంబానికి రూ.1 కోటి చెక్కును ఆర్టీసీ అందజేయనున్నట్లు తెలిపారు. శంకర్ కుటుంబంలో ఒకరికి ఉద్యోగంతో పాటు, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసినట్లు చెప్పారు. దక్షిణ భారత రవాణా శాఖ మంత్రులతో త్వరలో ప్రత్యేక సమావేశం జరగనుందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## 26 నుంచి 28 వరకు రిజిస్ట్రేషన్ సేవలకు విరామం

చేపడుతున్న ఈ సర్వర్ నిర్వహణ పనుల ద్వారా సర్వర్ వ్యవస్థలు మరింత సజావుగా పనిచేయడం, భద్రతా ప్రమాణాలు బలోపేతం కావడం, సేవల నాణ్యత మెరుగుపడడం కోసం ఈ తాత్కాలిక విరామం అవసరమని ఆయన పేర్కొన్నారు. అయితే జూన్ 26న మొహరమ్, జూన్ 28న ఆదివారం ప్రభుత్వ సెలవు దినాలు కావడంతో, మధ్యలో ఉన్న జూన్ 27న ఒక్కరోజు మాత్రమే ప్రభుత్వ పని దినంలో రిజిస్ట్రేషన్ సేవలకు అంతరాయం కలుగుతుందని గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. దీంతో సాధారణ ప్రజలకు కలిగే అసౌకర్యం అత్యల్పంగా ఉండేలా ఈ షెడ్యూల్ రూపొందించామని తెలిపారు. ప్రజలు తమ రిజిస్ట్రేషన్ సంబంధిత పనులను ముందస్తుగా ప్రణాళిక చేసుకోవాలని, జూన్ 29వ తేదీ నుంచి అన్ని సేవలు యథావిధిగా పునఃప్రారంభమవుతాయని ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు వెల్లడించారు. శాఖ నిర్వహణ పనులకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

## పవన్ కళ్యాణ్‌పై ఎందుకు కేసు పెట్టలేదు

ఉద్యమకారులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ఈ విషయాన్ని ప్రాధాన్యత లేని అంశంగా భావిస్తోందన్నారు. రేవంత్ రెడ్డి సీఎం అయ్యాక పలువురు నేతలు తెలంగాణ భావజాలంపై దాడి చేస్తున్నారని ఆరోపించారు. ఉద్యమానికి అండగా నిలిచిన కరీంనగర్‌లో తెలంగాణ తల్లి విగ్రహం లేకపోవడం ప్రజల త్యాగాలను అవమాన పరిచినట్లేనని కవిత అన్నారు. ఇకపోతే మాజీమంత్రి కేటీఆర్‌పై కల్వకుంట్ల కవిత షాకింగ్ కామెంట్స్ చేశారు. కేటీఆర్ సిరిసిల్లాకు వీకెండ్‌లో వచ్చి వెళ్లిపోతారని ఎద్దేవా చేశారు. సిరిసిల్లలో కవిత పర్యటించి. పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవిత మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ సర్కార్ రైతన్నల నడ్డి విరిస్తే కేటీఆర్ ఎందుకు మాట్లాడట్లేదని ప్రశ్నించారు. సిరిసిల్లలో సెస్ ఆగమాగం అయితే కేటీఆర్ ఎందుకు పట్టించుకోలేదని నిలదీశారు. రైతు డిస్కంలపై ఇప్పటి వరకు కేటీఆర్ ఎందుకు నోరెత్తలేదని కవిత ప్రశ్నల వర్షం కురిపించారు. రైతు డిస్కం కావాలో, వద్దో ఆయన ఎందుకు చెప్పలేదని నిలదీశారు. నేరెళ్లలో అక్రమ ఇసుక సంపాదన కోసం దళితులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారని ధ్వజమెత్తారు. నేరెళ్ల బాధితులకు ఇప్పటి వరకు ఎలాంటి న్యాయం జరగలేదని చెప్పుకొచ్చారు. నేరెళ్ల ఇసుక బాధితుల తరపున కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. కార్పొరేటర్‌గా వచ్చి.. నేరెళ్ల బాధితుల ఓట్లతో బండి సంజయ్ కేంద్రమంత్రి అయ్యారని కవిత పేర్కొన్నారు.

## రామగుండం ఎరువులు మనకే కేటాయించాలి

ఎందుకు కొనలేదని నిలదీశారు. ఈ విషయాన్ని తెలంగాణ రైతాంగంపై కక్ష అనుకోవాలా అన్నారు. కేంద్రంపై ఒత్తిడి పెంచేందుకు మంత్రుల బృందం ఢిల్లీకి వెళ్తామని స్పష్టం చేశారు. తొలకరి వర్షానికే విత్తనాలు వేస్తే రైతులు నష్టపోతారని చెప్పారు. రెండుసార్లు వర్షం పడితేనే సరిపడా తడి వస్తుందని.. అన్నదాతలు ఈ విషయాన్ని గమనించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఇకపోతే రైతు మరణించిన సందర్భంలో వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే రైతు బీమా పథకాన్ని ప్రభుత్వం అత్యంత బాధ్యతతో అమలు చేస్తోందన్నారు. ఎల్ఐసీకి చెల్లించాల్సిన మొత్తం వార్షిక ప్రీమియాన్ని ప్రభుత్వం ఇప్పటికే చెల్లించిందన్నారు. ల్గ÷తు బీమా పథకాన్ని నిలిపివేసినట్లు బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ప్రచారం పూర్తిగా అసత్యమని మంత్రి తుమ్మల అన్నారు. రైతు సంక్షేమం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి రాజీ పడదని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైతులకు ఉపయోగపడే ఏ ఒక్క పథకాన్ని నిలిపివేసిన దాఖలాలు లేవని, పథకాలను నిలిపివేసి రైతులను ఇబ్బందులకు గురిచేసిన చరిత్ర గత ప్రభుత్వానిదే అని దుయ్యబట్టారు. గత ప్రభుత్వం రైతులకు ఉపయోగపడే వ్యవసాయ యాంత్రీకరణ, సాయిల్ హెల్త్ టెస్ట్, సబ్సిడీపై విత్తనాలు వంటి పథకాలను నిలిపివేయడమే కాకుండా స్టేట్ వాటాను విడుదల చేయకుండా కేంద్ర ప్రాయోజిత పథకాలను సైతం రైతులకు దూరం చేసిందని విమర్శించారు. మా ప్రభుత్వం అధికారంలోకి రాగానే గత ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఎలాంటి బేషజాలకు పోకుండా అమలు చేయడమే కాకుండా.. గత ప్రభుత్వం ఆపేసిన పథకాలను పునరుద్ధరిస్తూ రైతులకు అండగా నిలుస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదే అని పేర్కొన్నారు. మ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 66,038 మంది రైతుల కుటుంబాలు రైతు బీమా పథకం ద్వారా లబ్ది పొందాయని మంత్రి తెలిపారు. ఆయా కుటుంబాల నామినీల ఖాతాల్లో మొత్తం రూ. 3301.90 కోట్లు జమ చేసినట్లు వెల్లడించారు. 2023 డిసెంబర్ నుంచి ఆ ఏడాది ముగిసే వరకు 20,090 కుటుంబాలకు రూ.1,004.50 కోట్లు, 2024 సంవత్సరంలో 25,861 కుటుంబాలకు రూ.1,293.05 కోట్లు బీమా సాయంగా అందించినట్లు వివరించారు. 2025-26 సంవత్సరానికి రాష్ట్రంలో 42.16 లక్షల మంది రైతులు రైతు బీమా పథకంలో నమోదు చేసుకున్నారని, వీరందరికీ వర్తించేలా ఎల్ఐసీకి చెల్లించాల్సిన మొత్తం వార్షిక ప్రీమియం రూ.1,359.56 కోట్లను ప్రభుత్వం పూర్తిగా చెల్లించిందన్నారు. దీంతో 20,087 కుటుంబాలకు రూ.1004.35 కోట్లు బీమా సహాయంగా అంది, మరణించిన రైతు కుంటుబాలకు ఆర్థిక చేయూత అందించడం జరిగిందని అన్నారు. రైతుల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ప్రభుత్వంపై బురదచల్లే ప్రయత్నాలు మానుకోవాలని మంత్రి హితవు పలికారు. రైతు మరణంతో దుఃఖంలో ఉన్న కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించి వారిని ఆర్థికంగా నిలదొక్క కొనే విధంగా రైతు బీమా పథకాన్ని ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందని, రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు.

## నెత్తురోడిన రాష్ట్ర రహదారులు

కొట్టింది. ఈ ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో ఇద్దరు జనగామ జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మల్కాజిగిరి జిల్లా మేడ్చల్ పరిధిలోని తుర్కపల్లి-మురహరిపల్లి మధ్య ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కరీంనగర్ నుంచి హైదరాబాద్ వైపు వస్తున్న కారు అదుపుతప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లింది. ఆ తర్వాత అతి వేగంతో ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సమాచారం అందిన వెంటనే మేడ్చల్ పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలు ముమ్మరం చేశారు. కారులో నుంచి మృతదేహాలను వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుల వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. ఈ ప్రమాదంతో హైవేపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి. దీంతో పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేసేందుకు యత్నించారు. వికారాబాద్‌జిల్లా పరిగి మండలం చిగురాల్‌పల్లి వద్ద బైక్‌ను టిప్పర్ లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో మోమిన్‌కలాన్‌కు చెందిన జావీద్‌పాషా (30) అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదంపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా.. మరో ముగ్గురు గాయపడ్డారు. హైదరాబాద్ నుంచి జగిత్యాల వైపు వెళ్తున్న కారు, డీసీఎం వ్యాన్ సిరిసిల్ల బైపాస్‌పై ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న అభిషేక్ అక్కడికక్కడే మృతిచెందాడు. మరో ముగ్గురు గాయపడ్డారు. కారులో ప్రయాణిస్తున్న వారిది జగిత్యాలగా తెలుస్తోంది. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

## మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

సచివాలయంలో మైనార్టీల సంక్షేమం, వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శనివారం ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్లు పాల్గొన్నారు. ఉర్దూ అకాడమీ స్వర్ణోత్సవాల సందర్భంగా రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌తో పాటు అన్ని జిల్లా కేంద్రాల్లో ఉర్దూ సంస్కృతిని ప్రతిబింబించేలా పెద్ద ఎత్తున 'ముషాయిరా' (కవి సమ్మేళనాలు) నిర్వహించనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో ఈ కార్యక్రమం నిర్వాహణకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

దేశంలోనే ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలను అన్ని రకాల ఆధునిక హంగులు, వసతులతో నిర్మిస్తున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 20 రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణం పూర్తయి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయని, మరో 17 పాఠశాలలు నిర్మాణ దశలో ఉన్నాయని అధికారులు ఈ సందర్భంగా వివరించారు. దీనిపై భట్టి విక్రమార్క స్పందిస్తూ... అసంపూర్తిగా మిగిలిపోయిన మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల భవనాల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. పనులు ఎక్కడా ఆగకుండా ఒక నిర్ణీత టైమ్ క్యాలెండర్‌ను రూపొందించుకుని, దాని ప్రకారమే పనులు పూర్తయ్యేలా పర్యవేక్షణ చేయాలని, మిగిలిన 17 పాఠశాల భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. మైనార్టీ యువత స్వయం ఉపాధి రంగాల్లో రాణించేందుకు మరియు వారిని ఆర్థికంగా నిలబెట్టడానికి రాజీవ్ యువ వికాసం' పథకం ద్వారా పెద్ద ఎత్తున ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు తెలిపారు. ఈ పథకం అమలు చేయడానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని అధికారులను ఆదేశించారు. క్రిస్టియన్ మైనార్టీల సంక్షేమం కొరకు ప్రత్యేకంగా రూ. 50 కోట్లు ఖర్చు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ నిధులను క్రిస్టియన్ మైనార్టీ యువత స్వయం ఉపాధి రంగంలో రాణించడానికి తగిన ఆర్థిక ప్రోత్సాహం అందించడానికి కేటాయిస్తామన్నారు. మైనార్టీ సంస్థలకు సంబంధించిన విలువైన వక్ఫ్ మరియు ఇతర భూములు

అన్యాక్రాంతం కాకుండా కాపాడేందుకు తగిన చట్టపరమైన రక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే, మైనార్టీల స్మశాన వాటికల చుట్టూ ప్రహరీ గోడల నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని, ఇందుకోసం తక్షణమే ఒక సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. ముస్లిం జనాభా ఎక్కువగా ఉన్న జిల్లా, డివిజన్ కేంద్రాల్లో స్మశాన వాటికల ఏర్పాటుకు అవసరమైన స్థలాలను సేకరించి కేటాయించాల్సిందిగా జిల్లా కలెక్టర్లకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేయనున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. హైదరాబాద్ నగరంలో జరగబోయే మొహర్రం వేడుకల సందర్భంగా, 9వ రోజున నిర్వహించే ప్రత్యేక కార్యక్రమానికి హాజరుకావాల్సిందిగా మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్ కోరగా.. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించి, తప్పకుండా హాజరవుతానని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ప్లానింగ్ ప్రిన్సిపల్ సెక్రటరీ గౌరవ ఉప్పల్, ఫైనాన్స్ సెక్రటరీ సిక్తా పట్నాయక్, వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా, మైనార్టీ ÷నాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కోత్వాల్ ఉన్నారు.

## ప్రభుత్వ భూముల కబ్జా నిరోధానికే హైడ్రా

రంగారెడ్డి,జూన్18 ఎవరైనా ప్రభుత్వ భూముల ను కబ్జా చేయాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుం టామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. కబ్జాలతో ప్రజలకు సమస్యలు రాకూడదనే హైడ్రా తీసుకువచ్చామని ప్రస్తావించారు. హైడ్రాను ఒక భూతంలా కొందరు చూపెడుతు న్నారని ధ్వజమెత్తారు. హైడ్రా పేదల జోలికి వెళ్లదని.. కబ్జాదారుల భరతం పడుతుందని స్పష్టం చేశారు. గుర్రంగూడ ఎకో పార్క్‌ను కబ్జా చేయాలని కొంతమంది చూశారని ఆరోపించారు. వనస్థలిపురంలో దేవుడి భూములనూ కూడా కబ్జా పెట్టారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం గుర్రంగూడ ఎకో పార్క్‌లో వన మహోత్సవం కార్యక్రమాన్ని సీఎం ప్రారంభించారు. హరితనిధి ద్వారా నాగలింగం మొక్కను ముఖ్యమంత్రి నాటారు. రోబోటిక్ ఏనుగును ఆవిష్కరించారు. ఈ క్రమంలో గుర్రంగూడ ఎకో పార్క్ నమూనాను అటవీ అధికారులు.. సీఎంకి వివరించారు. ఎకో పార్క్‌లో రూ.35.50 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. గుర్రంగూడ రిజర్వ్ ఫారెస్ట్‌లో రూ.17.84 కోట్లతో అభివృద్ధి పనులని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. 2018లో కొందరి కుట్ర వల్ల కొడంగల్‌లో ఓడిపోయానని చెప్పుకొచ్చారు. ఇక తాను ఏమీ చేయలేనని కొందరు భావించారని అన్నారు. మల్కాజ్‌గిరి ప్రజలు తనను ఎంపీగా గెలిపించారని తెలిపారు. ప్రశ్నించే గొంతు ఉండాలని నాడు ఎంపీగా తనను గెలిపించారని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. తనను ఓడించాలని కొందరు ఎన్నో కుట్రలు పన్నారని ధ్వజమెత్తారు. ఇక్కడి ప్రజల అభిమానమే తనను ముఖ్యమంత్రిగా నిలబెట్టిందని వివరించారు. ఎల్బీనగర్ ప్రజలు తనకు 30 వేలకుపైగా ఓట్ల మెజారిటీ ఇచ్చారని అన్నారు. తన సొంతూరు కొండారెడ్డిపల్లి లాంటిదే తనకు ఎల్బీనగర్ అని అభివర్ణించారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో ఎల్బీనగర్ అభివృద్ధిని పట్టించుకోలేదని మండిపడ్డారు. సీఎంగా ఎల్బీనగర్ సమస్యల పరిష్కారానికి తాను కృషి చేస్తానని మాటిచ్చారు. రంగారెడ్డి జిల్లాకు అన్నివిధాలా అండగా నిలుస్తున్నామని స్పష్టం చేశారు. కోహెడలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మించామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కాలుష్య కోరల్లో చిక్కుకుని ఢిల్లీ ప్రజలు బాధపడుతున్నారని సీఎం వ్యాఖ్యానించారు. మన హైదరాబాద్‌కు అలాంటి పరిస్థితి రావొద్దనే మొక్కల పెంపకాన్ని ప్రోత్సాహిస్తున్నామని వివరించారు. 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీకి ప్రణాళికలు సిద్ధం చేశామని స్పష్టం చేశారు. ఫ్యూచర్ సిటీ కడతామంటే మళ్లీ ఫార్మా కంపెనీలు తెస్తామంటున్నారని చెప్పుకొచ్చారు. ఫ్యూచర్ లేనివాళ్లు ఫ్యూచర్ సిటీ రద్దు చేస్తామంటున్నారని దుయ్యబట్టారు. ముందు సిద్దిపేట గెలిచిరండి.. ఆ తర్వాత రద్దుపై మాట్లాడదామని హితవు పలికారు. 60 శాతం గ్రీనరీ పెంచుతామంటే కేసులు వేశారని సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరేమనుకున్నా మూసీ నది ప్రక్షాళన చేసి తీరుతామని రేవంత్‌రెడ్డి అన్నారు. గండిపేట నుంచి గౌరెల్లి వరకు 55 కి.మీ మేర ఈ పనులు చేపడతామని చెప్పారు. సబర్మతి, గంగా రివర్‌ఫ్రంట్‌ల కంటే మెరుగ్గా అంతర్జాతీయ స్థాయిలో దీన్ని తీర్చిదిద్దుతామన్నారు. కాలుష్య రహిత వాతావరణం ప్రజలకు ఇవ్వాలని ప్రయత్నిస్తున్నాం. నగర అవసరాల కోసం 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నాం. ఫ్యూచర్ లేని నేతలు ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని చెబుతున్నారు. వాళ్ల ఫ్యూచర్‌ను ప్రజలు నిర్ణయిస్తే.. ఫాంహౌస్‌కు పరిమితమయ్యారు. ఫ్యూచర్‌సిటీని రద్దు చేస్తానన్న ఆయన ఈసారి సిద్దిపేటలో గెలవరు. కొందరు ఎన్జీటీలో కేసులు వేస్తున్నారు. మూసీలో కాలుష్యం కంటే.. కల్వకుంట్ల వాళ్ల కడుపులో కాలుష్యమే ఎక్కువ. ఎవరు అడ్డుపడినా అంతర్జాతీయస్థాయిలో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మించి తీరుతాం అని అన్నారు. కేసీఆర్ ఫ్యామిలీపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. గుర్రంగూడలో జరిగిన ఈ కార్యక్రమంలో పలు అభివృద్ధి పనులను వర్చువల్ గా ప్రారంభించారు సీఎం రేవంత్..మూసీ పునరుజ్జీవం వద్దంటున్న సుధీర్ రెడ్డి గతంలో మూసీ కార్పొరేషన్ చైర్మెన్ పదవి ఎలా తీసుకున్నారని ప్రశ్నించారు. భూకబ్జాలతో ప్రజలకు సమస్య రావొద్దని హైడ్రా తెచ్చామని... హైడ్రాను భూతంలా చూపిస్తున్నారని మండిపడ్డారు. హైడ్రా పేదల జోలికి వెళ్ళదని.. కబ్జాదారుల భరతం పడుతుందని అన్నారు. ఢిల్లీ కాలుష్య కోరల్లో చిక్కుకొని ప్రజలు ఇబ్బంది పడుతున్నారని.. మన హైదరాబాద్ కు ఆ పరిస్థితి రావొద్దని మొక్కల పెంపకం చేపట్టామని అన్నారు.

## ఎరువులు.... విత్తనాలు దుకాణాలపై టాస్క్ ఫోర్స్ తనిఖీలు



జనగామ జిల్లా/ రఘునాథపల్లి/( అక్షరం న్యూస్ )జూన్ 18:

మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపులలో రెవెన్యూ, పోలీస్, వ్యవసాయ శాఖ అధికారులు గురువారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రైతులు లైసెన్స్ ఉన్న డీలర్ల వద్ద మాత్రమే వ్యవసాయ ఆధారిత విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు కొనుగోలు చేయాలని సూచించారు. నకిలీ విత నాలు విక్రయిస్తే చట్టపరంగా శిక్ష తప్పదని ఫర్టిలైజర్ షాపుల యాజమానులను హెచ్చరించారు. ఎలినినో ప్రభావం వలన తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు మెండుగా ఉన్నందున రైతులు ఎట్టి పరిస్థితుల్లో ముందుగానే విత్తనాలు విత్తడం మానుకోవాలని, అలాగే అరుతడి పంటల సాగుకు రైతులు మొగ్గు చూపాల్సిన అవసరం ఉందని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజేష్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి అక్కిరెడ్డి కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుంది

- **లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ సొత్కు సుదర్శన్**



మంచిర్యాల జిల్లా మందమర్రి/ జూన్ 18/అక్షరం న్యూస్ -:

యోగ సాధన ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని,అనేక రకాల రుగ్మతలను నివారించుకోవచ్చుని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ సోత్కు సుదర్శన్, డైరెక్టర్ పుస్కూరి నర్సింగరావు చైర్ పర్సన్ పోలు శ్రీనివాస్ లు అన్నారు. విలేజ్ మందమర్రిలోని రామాలయం సమీపంలో నిర్వహిస్తున్న ఉచిత యోగ శిక్షణ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు.నరసింగరావు--ప్రణతి దంపతుల ఆధ్వర్యంలో, శ్రీమతి మీనాక్షి యోగ, పిరమిడ్ ధ్యాన శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యోగ పట్ల ప్రతి ఒక్కరూ ఆసక్తి పెంచుకుని దానిని నిత్యజీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. యోగతో శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు జీవనశైలి వ్యాధులను కూడా నియంత్రించుకోవచ్చన్నారు. యోగ శిక్షణ కార్యక్రమం ముగియనున్న నేపథ్యంలో మందమర్రి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శిక్షణలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అదేవిధంగా ఈ శిక్షణలో పాల్గొన్న పిల్లలందరికీ యోగ పట్ల ఆసక్తి చూపాలని కన్సిలేషన్ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో యోగ మాస్టర్లు కొంపెల్లి లలిత, మీనాక్షి, లైన్స్ క్లబ్ సెక్రటరీ జాకీర్ హుస్సేన్, తాడికొండ లూథర్ భూపాల్, బింగి రాజన్న,ఆలయ పూజారి,తదితరులు, పాల్గొన్నారు.

## శారీరక మానసిక స్వాంతన లక్ష్యంగా యోగా

- **ఆయుర్వేద మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నీరజ.**



మంచిర్యాల జిల్లా/ మందమర్రి/ జూన్ 18/ అక్షరం న్యూస్ -:

12 వ అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని గురువారం మందమర్రి ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ లో “ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగ మెడికల్ ఆఫీసర్ డా. నీరజ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా వృద్ధుల జనాభా శరవేగంగా పెరుగుతున్న వేళ, వారికి శారీరక, మానసిక స్వాంతన చేకూర్చడమే లక్ష్యంగా యోగ అనేది కేవలం యువతకు ఆరోగ్యవంతులకు మాత్రమే పరిమితం కాదని, పండు టాకులకు సైతం అదొక సంజీవని అని ప్రపంచానికి చాటి చెప్పడమే దీని ప్రధాన ఉద్దేశం. వయస్సు మీద పడే కొద్ది కీళ్ల నొప్పులు, శ్వాస సమస్యలు, మతిమరుపు, ముఖ్యంగా ఒంటరితనం తీవ్రంగా వేధిస్తూ ఉంటాయి నిత్యం యోగా చేయడం వలన వృద్ధుల్లో శారీరక చురుకుదనం పెరుగుతుందని మానసిక ప్రశాంతత లభిస్తుంది అని తెలియజేశారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా మందమర్రి మున్సిపల్ కమిషనర్ రాజలింగు, వ్యాపార కమిటీ అధ్యక్షుడు కనకయ్య గౌడ్, తిరుమలేష్, ఆయుష్ యోగ శిక్షకులు రాం మోహన్, శైలజ, ఫార్మసిస్టు లక్ష్మి, కిషన్ ఆశ వర్కర్లు యోగా గురువు కొంపల్లి రమేష్ లతా, సదానందం స్థానిక వ్యాపారస్తులు మరియు యోగ సభ్యులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే సహకారంతో ఆసుపత్రి సమస్యలన్నీ పరిష్కరిస్తాము..





జ్యోతి నగర్ ఎన్టిపిసి జూన్ 18 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

ఎం ఎల్ ఎ సహకారంతో ఆసుపత్రి సమస్యలు పరిష్కరిస్తామని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి హామీ ఇచ్చారు. గురువారం ఆయన ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రి సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ హిమబిందు సింగ్ , ఆర్ ఎం ఓ కృపా బాయ్ ఆయనకు ఘనంగా స్వాగతం పలికి నోటు పుస్తకాలు ,పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. తరచుగా విద్యుత్ సమస్య తలెత్తుతుందని వైద్యులు ఆయన దృష్టికి తీసుకురాగా ఎన్ పి డి సి ఎల్ అధికారులతో ఫోన్ లో మాట్లాడి వెంటనే చర్య తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామగుండం నగరాన్ని ఒక ప్రధాన వైద్య కేంద్రంగా తీర్చి దిద్దాడానికి ఎం ఎల్ ఎ రాజ్ ఠాకూర్ కృషి చేస్తున్నారని , ఆయన ఆశయాలకు అనుగుణంగా పేషంట్లకు ఉత్తమ వైద్య సేవలందించాలని అన్నారు. అత్యవసర సమయంలో త్వరితగతిన స్పందించాలని అన్నారు. పేషంట్లు , వారి బంధువులతో ఓర్పుగా నడుచుకుంటూ వారికి మనో ధైర్యాన్ని ఇవ్వాలని అన్నారు. కాగా ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైౌ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్పొరేటర్ కంకణాల మౌనిక భర్త రాజును పరామర్శించారు. వైద్య చికిత్స అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య , కార్పొరేటర్ గట్ల రమేష్ , యుగంధర్ , వైద్యులు నాగి రెడ్డి తదితరులు ఉన్నారు.

## బీజేపీ మాజీ మండలాధ్యక్షులు భైరగోని కిట్టుని పరామర్శించిన కేంద్ర మంత్రి బండి సంజయ్




చొప్పదండి/ కరీంనగర్, జూన్ 17 (అక్షరం న్యూస్ )

మాజీ బిజెపి చొప్పదండి మండల అధ్యక్షుడు, భూపాలపట్నం మాజీ ఉపసర్పంచ్ భైరగొని కిట్టు గౌడ్ తండ్రి కొద్ది రోజుల క్రితం మరణించినందున బుధవారం రోజున కేంద్ర మంత్రి బండి సంజయ్, చొప్పదండి మాజీ ఎమ్మెల్యే బొడిగే శోభక్క లు భూపాలపట్నం లోని కిట్టు గౌడ్ ఇంటికి వెళ్లి కిట్టు గౌడ్ ని కలిసి పరామర్శించారు.అనంతరం వారి తండ్రి మృతి పట్ల సంతాపాన్ని తెలియచేసారు.

## చొప్పదండి మండలంలోని మంగళపల్లి గ్రామంలో 10 సీసీ కెమెరాలు ఏర్పాటు

- **చొప్పదండి ఎస్సై నరేష్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం**



చొప్పదండి/ కరీంనగర్, జూన్ 18 (అక్షరం న్యూస్ )

మంగళపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ మరియు ఇతర దాతల సహాయంతో గ్రామ వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 10 కమ్యూనిటీ సీసీ కెమెరాలను చొప్పదండి ఎస్సై నరేష్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా చొప్పదండి ఎస్ఐ నరేష్ రెడ్డి మట్లాడుతు ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల ఎటువంటి దొంగతనాలు జరగకుండా మరియు అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ఉపయోగపడతాయని మరియు జరిగిన వెంటనే గుర్తుంచడానికి సీసీ కెమెరాలు ఉపయోగపడతాయని, ఒక సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని, కావున చొప్పదండి మండలం లోని ప్రతి గ్రామంలో మంగళపల్లి గ్రామంలాగా సీసీ కెమెరాల ఏర్పాటులో ప్రజలు ముందుకు రావాలని సూచించారు.మంగళపల్లి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చెయ్యటానికి సహకరించిన సర్పంచ్ పెద్దెల్లి శారద- సురేష్, ఉప సర్పంచ్ ఎవన్ రెడ్డి లను, ఇతర దాతలను, ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.ఇట్టి కార్యక్రమంలో గ్రామ సర్పంచ్,, ఉప సర్పంచ్, వార్డ్ సభ్యులు, కార్యవర్గ సిబ్బంధి, ఎఎస్ఐ ఘనియొద్దీన్,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## సింగరేణి ఆర్ జీ వన్ పర్సనల్ విభాగ సమీక్ష సమావేశం



జ్యోతి నగర్ ఎన్టిపి సి జూన్ 18 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

సింగరేణి సంస్థ పర్సనల్ విభాగానికి సంబంధించిన వివిధ అంశాలపై సమీక్ష సమావేశం ఆర్జీ-1 ఏరియా జీఎం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశాన్ని జీఎం (పర్సనల్ ఐఆర్) శ్రీమతి కవిత నాయుడు కొత్తగూడెం కార్పోరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు.ఈ సందర్భంగా సంస్థలోని అన్ని ఏరియాల పర్సనల్ విభాగాల పనితీరు, ఉద్యోగుల గైర్హాజరు క్రమ శిక్షణ చర్యలు సంబంధిత అంశాలు, పెండింగ్‌లో ఉన్న పదోన్నతులు, విజిలెన్స్ కేసులు కార్మిక సంబంధిత సమస్యలు మరియు ఇతర పరిపాలనా అంశాలపై సమగ్రంగా సమీక్షించారు.పెండింగ్‌లో ఉన్న అన్ని ఫైళ్లు, ఉద్యోగుల సమస్యలు మరియు పలు అంశాలను ఎటువంటి జాప్యం లేకుండా నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు శ్రీమతి కవిత నాయుడు సూచించారు. ఉద్యోగులకు మెరుగైన సేవలు అందించడంలో పర్సనల్ విభాగం మరింత చురుకుగా వ్యవహరించాలని, సమస్యల పరిష్కారంలో సమన్వయంతో పనిచేయాలని ఆమె పేర్కొన్నారు.ఈ సమావేశంలో పర్సనల్ మేనేజర్ శ్రీ రవీందర్ రెడ్డి, డివై పియం నాగుల వేణు, సీనియర్ పీఓలు శ్రావణ్ కుమార్, ఫిరోజ్ ఖాన్, హనుమంతరావు, అన్ని గనుల సంక్షేమ అధికారులు, పర్సనల్ విభాగ అధికారులతో పాటు వివిధ శాఖల అధిపతులు పాల్గొన్నారు.

## అంగన్వాడి సెంటర్లో చిన్నారులకు నూతన దుస్తులను అందజేసిన ఒకటోవ డివిజన్ కార్పొరేటర్ మడిపెల్లి విజయ మల్లేష్



జ్యోతి నగర్ ఎన్టిపిసి జూన్ 18 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

రామగుండం కార్పొరేషన్ పరిధిలోని ఒకటవ డివిజన్ లోని అంగన్వాడి సెంటర్లకు చెందిన సరిత,భూలక్ష్మి ఆధ్వర్యంలో పీకే రామయ్య కాలనీ అంగన్వాడీ సెంటర్ బుధవారం రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన దుస్తులను పిల్లలకు అందజేశారు. నూతనంగా అంగన్వాడికి వచ్చిన చిన్నారులకు అక్షరాభ్యాసం చేపియ్యడం జరిగింది ఈ కార్యక్రమానికి ఒకటవ డివిజన్ కార్పొరేటర్ మడిపెల్లి విజయ మల్లేష్ హాజరై పిల్లలకు దుస్తులను అందజేసి చిన్నారులను ఆశీర్వదించడం జరిగింది అనంతరం పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కూడా అంగన్వాడీలో పేర్లు నమోదు చేసుకోవాలని చిన్న పిల్లల్ని అంగన్వాడికి కేంద్రానికి పంపించాలని ఆయన కోరారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడి సెంటర్ ద్వారా గర్భిణీ స్త్రీలకు పౌష్టికరమైన ఆహారం అందిస్తూ ఈ ఏడాది నుండి చిన్నారులకు యూనిఫామ్ అందజేయడం ఎంతో అభినందనమని మల్లేష్ అన్నారు ఈ కార్యక్రమంలో పీకే రామయ్య కాలనీవాసులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్య హక్కులపై దాడి..



సూర్యాపేట జూన్ 18 (అక్షరం న్యూస్ )

బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనన్న ఆదేశాల మేరకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం సచివాలయం ముట్టడికి పిలుపునిచ్చిన బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు నిద్ర సంపత్ నాయుడు ని పోలీసులు అక్రమంగా అదుపులోకి తీసుకుని గోషామహల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.విద్యార్థుల హక్కుల కోసం పోరాడటం నేరం కాదని గోషామహల్ పోలీస్ స్టేషన్‌కు తరలించిన బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు నిద్ర సంపత్ నాయుడుని తక్షణమే విడుదల చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు కోరారు.

## ప్రైవేటు స్కూల్స్ లో అధిక ఫీజు లను నియంత్రణ చేయాలి...

- విద్యా హక్కు చట్టం -2009 ని అమలు చేయాలి
- టీఆర్ పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టె జానయ్య యాదవ్



సూర్యాపేట టౌన్ జూన్ 18(అక్షరం న్యూస్):

ప్రైవేట్ స్కూళ్లలో ఫీజులపై నియంత్రం లేదని, ఇష్ట రాజ్యాంగ ఫీజులు వసూలు చేస్తున్నారని, ఫీజులు కట్టలేక చాలామంది మధ్యతరగతి తల్లిదండ్రులు తమ పిల్లల్ని చదివించలేని పరిస్థితి ఏర్పడిందని తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టె జానయ్య యాదవ్ అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ సూర్యాపేటలో విద్యావ్యవస్థ పూర్తిగా వ్యాపారంగా మారిందని, చాలా పాఠశాలలో అడ్డగోలుగా ఫీజు వసూలు చేస్తున్నారని అన్నారు. కొన్ని పాఠశాలలో మధ్యతరగతి వారు తమ పిల్లలను చదివించలేని పరిస్థితి ఏర్పడిందని ఆయన చెప్పారు. జిల్లా లోని పాఠశాలలో విద్యాహక్కు చట్టం 2009 ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యాహక్కు చట్టాన్ని జిల్లాలో కచ్చితంగా అమలు చేయాలని అందుకోసం తాము పోరాటం చేస్తామని అన్నారు. పేదలకు రాజ్యాంగం కల్పించిన హక్కును జిల్లా యంత్రాంగం అమలు చేయడం లేదని ఆయన అన్నారు. ప్రైవేట్ పాఠశాలలో అధిక ఫీజులతో పాటు పుస్తకాలు ఇంకా యూనిఫాంలు స్టేషనరీ బలవంతంగా అంట కడుతున్నారని, వీటి కోసం పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారని వీటి పై జిల్లా యంత్రాంగం ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని ఆయన అన్నారు. ప్రైవేటు స్కూల్స్ లో పేరెంట్స్ కమిటీని పొలిటికల్ కమిటీని ఏర్పాటు చేయాలని ఫీజులపై కచ్చితంగా నియంత్రణ చేయాలని అన్నారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ విద్యార్థి విభాగం ఆధర్యంలో అన్ని పాఠశాలలో తాము ఆందోళన చేస్తామని చెప్పారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పన చేయాలని, మరుగుదొడ్లు సౌకర్యం లేక విద్యార్థినులు చాలా ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణం చేసి పరిశుభ్రంగా ఉంచడానికి తగిన సిబ్బంది నియమించాలని ఆయన అన్నారు.

## అర్వపల్లి ఎస్సై ఈటా సైదులు సస్పెండ్

సూర్యాపేట,తుంగతుర్తి జూన్ 18 (అక్షరం న్యూస్):



సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం, నాగారం సర్కిల్ పరిధిలోని అర్వపల్లి పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న ఈటా సైదులను బుధవారం జిల్లా ఎస్పీ కె నరసింహ సస్పెండ్ చేశారు.విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించడమే కాకుండా, ఒక కీలక ఫోక్సో కేసు వ్యవహారంలో అనుచిత ప్రమేయం ఉన్నట్లు వచ్చిన ఆరోపణలను సీరియస్‌గా విచారించిన ఉన్నతాధికారులు ఈ చర్య తీసుకున్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి.పలు కేసుల్లో ఆధారాలను తారుమారు చేసి అవినీతి, అక్రమాలను పాల్పడ్డట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

# ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై విస్తృత శిక్షణ



జ్యోతి నగర్ ఎన్టిపిసి, జూన్ 18: పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

రామగుండం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో జూన్ 25 నుంచి ప్రారంభంకానున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు సంబంధించి గురువారం ఎన్టిపిసి కాకతీయ కల్యాణ మండపంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగిన ఈ కార్యక్రమానికి ఎన్నికల నమోదు అధికారి, సహాయ కలెక్టర్ (భూ పరిపాలన) శ్రీమతి జె. అరుణశ్రీ ఐఏఎస్ అధ్యక్షత వహించారు. నియోజకవర్గ పరిధిలోని సహాయ ఎన్నికల నమోదు అధికారులు, బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి అధికారుల పర్యవేక్షకులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా శ్రీమతి అరుణశ్రీ మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనల ప్రకారం నిర్వహించాలని సూచించారు. ప్రతి అర్హుడైన పౌరుడికి ఓటరు జాబితాలో పేరు నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని, అర్హత లేని పేర్ల తొలగింపు, మార్పులు, చేర్పులు నిర్దేశిత విధానంలో చేపట్టాలని అధికారులకు మార్గనిర్దేశం చేశారు. శిక్షణ కార్యక్రమంలో అంతర్గాం తహసీల్దార్ ప్రసాద్, రామగుండం తహసీల్దార్ రవీందర్ రావు, మాస్టర్ ట్రైనర్, నాయబ్ తహసీల్దార్ అనీల్ పాల్గొని ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమానికి సంబంధించిన విధివిధానాలను వివరించారు.రాజకీయ పార్టీల తరఫున భారత రాష్ట్ర సమితి నాయకుడు, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, పార్టీ ప్రతినిధులు బొంతల రాజేష్, అసిఫ్ పాషా, బహుజన్ సమాజ్ పార్టీ నాయకుడు జనగామ లింగయ్య, భారత కమ్యూనిస్టు పార్టీ నాయకుడు జి. గోవర్ధన్ తదితరులు హాజరయ్యారు. కార్యక్రమంలో పాల్గొన్న అధికారులకు, సిబ్బందికి ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం నిర్వహణపై సమగ్ర అవగాహన కల్పించారు.

## టూ వీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ తోటి మెకానిక్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత



జ్యోతి నగర్ ఎన్టిపిసి జూన్ 18 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

గత సంవత్సరం స్థానిక ఎన్టిపిసి కృష్ణా నగర్ కు చెందిన టూవీలర్ మెకానిక్ కాసర్ల సతీష్ ప్రమాదవశాస్తు క్రిందపడి తలకు బలమైన గాయమై మృతి చెందారు. తనకు ఇద్దరు కూతుర్లు వారి కుటుంబానికి గురువారం టు వీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ తరపున తోటి మెకానికులు మానవత దృక్పథంతో గొప్ప మనసుతో వారికి తోచిన సహాయాన్ని అందజేశారు. మొత్తం 35 వేల రూపాయలను కీర్తిశేషులు కాసర్ల సతీష్ అలియాస్ ఢిల్లీ సతీష్ సతీమణి పద్మ, వారి కూతురు శ్రావ్య పేర్ల మీద పోస్ట్ ఆఫీస్ లో ఫిక్స్డ్ డిపాజిట్ చేసి ఆ బాండ్ ను టూ వీలర్ మెకానిక్ అసోసియేషన్ కమిటీ సభ్యుల సమక్షంలో 34 వ డివిజన్ కార్పొరేటర్ బొడిగె భరత్ గౌడ్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు అధ్యక్షులు రెడ్డి రాజకుమార్ ఉపాధ్యక్షులు బజాజ్ కుమార్ ప్రధాన కార్యదర్శి సి సీతారామ స్వచ్ఛంద సేవ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు మాతంగి శివరాజ్ గౌరవ సలహాదారులు సత్యం సమ్మిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి కోశాధికారి సంజీవరెడ్డి సంయుక్త కార్యదర్శి ఆరెపల్లి కుమార్ ఎండి రఫీక్ బస్తీ వాసులు రాంపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

## రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు సబ్సిడీపై అందించాలి ఏఐకేఎంఎస్



జ్యోతి నగర్ ఎన్టిపిసి, జూన్ 18 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

: రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలను సబ్సిడీపై అందించాలని అఖిల భారత రైతు-కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) జిల్లా కార్యదర్శి కొల్లూరి మల్లేశం డిమాండ్ చేశారు. ఏఐకేఎంఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం రామగుండం మండల కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, రైతాంగ సమస్యలపై తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా కొల్లూరి మల్లేశం మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల రోజులు గడిచినా రైతులకు సరైన విత్తనాలు, ఎరువులు అందించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసుల మేరకు సీ-2 వ్యయంపై 50 శాతం అదనంగా మద్దతు ధర (ఎంఎస్‌పీ) కల్పిస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీ అమలు కాలేదని అన్నారు. రైతులను ఆదుకుంటామని చెప్పి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు వ్యవసాయ చట్టాల వల్ల రైతాంగం తీవ్ర నష్టపోయిందని ఆరోపించారు.ఇటీవల యుద్ధ పరిస్థితులను సాకుగా చూపుతూ యూరియా, పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ తదితర నిత్యావసర వస్తువుల ధరలను పెంచడంతో రైతులు, వ్యవసాయ కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పెంచిన ధరలను వెంటనే తగ్గించడంతో పాటు రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలను సబ్సిడీపై అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకుడు మేరుగు చంద్రయ్య, జిల్లా అధ్యక్షుడు గుండేటి మల్లేశం, నాయకులు ఐ రాజేశం, గుండు రాజయ్య, మల్యాల దుర్గయ్య, పెగడపల్లి దుర్గయ్య, ఎడ్ల రవికుమార్, పోగుల శేఖర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




## లయన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని స్ఫూర్తి నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం




జ్యోతి నగర్ ఎన్టిపిసి, జూన్ 18: పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

లయన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని స్ఫూర్తి 15వ ఇన్‌స్టాలేషన్ కార్యక్రమం గురువారం స్థానిక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. 2026--27 లయనిస్టిక్ సంవత్సరానికి నూతన కార్యవర్గంగా అధ్యక్షుడిగా లయన్ కోదాటి ప్రవీణ్, కార్యదర్శిగా లయన్ ఎతిరాజ్ సురేష్, కోశాధికారిగా లయన్ రెడ్డి రవీందర్ రెడ్డి ప్రమాణ స్వీకారం



చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి, ఇన్‌స్టాలేషన్ చైర్‌పర్సన్‌గా హాజరైన లయన్ గుంటుక చంద్రప్రకాశ్ (ఖీఎణ+) నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించి అభినందనలు తెలిపారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సమాజ సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టి ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో అవయవదానంపై విశేష అవగాహన కల్పిస్తూ సేవలు అందిస్తున్న సదాశయ సేవా ఫౌండేషన్ బాధ్యులు వాసును ప్రత్యేకంగా సన్మానించారు. అవయవదానం ద్వారా అనేకమంది ప్రాణాలను కాపాడవచ్చని వక్తలు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో గెస్ట్ ఆఫ్ హానర్‌లుగా లయన్స్ వొల్లాల హరికృష్ణ, కొల్లూరి ఆనందం, నార్ల ప్రసాద్, సోమారపు లావణ్య, కొమురవెల్లి సుధాకర్, జయప్రకాశ్ చావ్డా, గుంత వినోద్, మామిడిపెల్లి శ్రీధర్, కొల్లూరి విజేందర్, కొలిపాక సతీష్ పాల్గొన్నారు. అలాగే సీనియర్ లయన్స్ ఇనుగుర్తి రమేష్, బంక రామస్వామి, కజంపురం రాజేందర్, రమణారావు, గోపాలరావు, రంగారావు, షేగంటి నరేష్, విక్రమ్, రత్నాకర్, తాటికొండ రాజు, మల్లికార్జున్‌తో పాటు లయన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని స్ఫూర్తి కుటుంబ సభ్యులు, గోదావరిఖని, వాసవి, జ్యోతినగర్ ప్రగతి లయన్స్ క్లబ్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.సమాజ సేవే లక్ష్యంగా ముందుకు సాగుతామని నూతన అధ్యక్షుడు కోదాటి ప్రవీణ్ ఈ సందర్భంగా తెలిపారు.



# నీటి వృధాను అరికట్టి...బాధ్యులపై చర్యలు తీసుకోవాలి



జనగామ జిల్లా/ రఘునాధపల్లి /(అక్షరం న్యూస్ )జూన్ 18:

మండేలగూడెం చెరువులో చేపలు పట్టేందుకు తూము ద్వారా నీరును వృధాగా వదిలివేయడంతో చెరువునీటి వృధాను అరికట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.నెల రోజుల నుండి తూము ద్వారా చెరువు నీటిని వదులుతూ వృధా చేస్తున్నారని, దీంతో చెరువు నీరు లేక వట్టిపోవడంతో పాటు భూగర్భజలాలు తగ్గిపోయే ప్రమాదముందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చేపలు పట్టాలనే నేపంతో చెరువు నీటిని వృధా చేయడం వల్ల నీటిమట్టం పూర్తి స్థాయిలో తగ్గి ఎండ వేడిమికి చేపలు చనిపోతున్నాయన్న విషయాన్ని విస్మరించి నీటిని వృధా చేస్తున్న వారిపై సంబంధిత అధికారులు చట్టపరంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు

# జోయాలుకాస్ వారి సౌజన్యంతో విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

- ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆంజనేయులు సాగర్



శేరిలింగంపల్లి అక్షరం ప్రతినిధి: అంజయ్యనగర్ డివిజన్ పరిధిలోని అంజయ్యనగర్ మెయిన్ రోడ్డులో ఉన్న జోయాలుకాస్ స్టోర్ ఆధ్వర్యంలో సిద్ధిక్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులందరినీ జోయాలుకాస్ స్టోర్‌కు ప్రత్యేకంగా ఆహ్వానించి బ్యాగులను అందజేశారు. జోయాలుకాస్ యాజమాన్యం ఆహ్వానం మేరకు అంజయ్యనగర్ డివిజన్ నాయకులు ఆంజనేయులు సాగర్ ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు బ్యాగులను పంపిణీ చేశారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పడే ఇటువంటి సామాజిక సేవా కార్యక్రమాలను జోయాలుకాస్ సంస్థ నిర్వహించడం అభినందనీయమని, ఆంజనేయులు సాగర్ జోయాలుకాస్ యాజమాన్యం మరి సిబ్బందినీ కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాదాపూర్ ఎస్సై శ్వేత, సిద్ధిక్‌నగర్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బలమణి, సిద్ధిక్‌నగర్ కాలనీ అధ్యక్షులు తిరుపతి రెడ్డి, జోయాలుకాస్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు రవీందర్, ప్రతిభ రేణుక, మాధవి, అఖిల్, విశాలి తదితరులు పాల్గొన్నారు.

# అంటువ్యాధుల నుండి అప్రమత్తంగా ఉండాలి...రామగుండం మేయర్



జ్యోతి నగర్ ఎన్టిపి సి జూన్ 18 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

అంటువ్యాధుల నుండి అప్రమత్తంగా ఉండాలని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు. వార్డు సందర్శనలో భాగంగా గురువారం 46 వ డివిజన్ సంజయ్ గాంధీ నగర్ ప్రాంతంలో పర్యటించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైన నేపధ్యంలో పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే దోమలు , ఈగలకు నిలయమై అంటు వ్యాధులు విజృంభించే అవకాశం ఉంటుందని అన్నారు. డెంగ్యూ , మలేరియా వంటి అంటు వ్యాధుల బారిన పడి ఆసుపత్రుల చుట్టూ తిరగవలసి వస్తుందని అన్నారు. కాబట్టి చెత్త బహిరంగ ప్రదేశాలలలో , కాలువల్లో వేయకుండా నగర పాలక సంస్థ వాహనాలకు అందించాలని కోరారు.కాగా ఈ సందర్భంగా సంజయ్ గాంధీ నగర్ రోడ్ లో సానిటేషన్ స్పెషల్ డ్రైవ్ చేపట్టి రోడ్డుకు ఇరువైపులా దారికి అడ్డంగా పెరిగిన పొదలు , చెట్ల కొమ్మలు , నాలా శుభ్రం చేయడానికి వీల్లేకుండా పైన పరిచిన రాళ్ళను తొలగించారు , నాలాల లో పూడిక తొలగించారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు , నగర పాలక సంస్థ అధికారులు నవీన్ , మీర్ , పబ్బాల శ్రీనివాస్ . సంపత్ , చంద్రా రెడ్డి , మెప్మా సి ఓ ఊర్మిళ తదితరులు పాల్గొన్నారు.



# బాబోయ్.. ఇవేం ఎండలు!



రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /జూన్ -18(అక్షరం న్యూస్ )

వామ్మో ఇవేమి ఎండలు... నిప్పుల కుంపటిని తలిపిస్తున్నాయి.. జూన్ నెల సగం గడిచినా.. ఒక్క వర్షం కురవలేదు.. ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకుపైగా నమోదవుతున్నాయి.. బయటకు వెళితే వడగాల్పులు... ఇంట్లో ఉంటే ఉక్కపోత... ఫ్యాన్లు, కూలర్లు ఏమాత్రం పనిచేయడం లేదు... ఏసీ ఉంటేనే కొంత ఉపశమనం... ఏసీ నుంచి బయటకు వస్తే నరకమే.. జిల్లావ్యాప్తంగా ఇదే పరేస్థితి.. వర్షాలు కురిపించు దేవుడా అంటూ ప్రతి ఒక్కరూ ఆకాశం వైపు చూస్తున్నారు..



రెండు, మూడు రోజులు ముఖ్యంగా ఎండలు దంచి కొడుతున్నాయి. మంగళ, బుధ, గురు వారాల్లో ఎండ తీవ్రత తీవ్రంగా ఉంది. బయట అడుగుపెట్టాలంటే ప్రజలు భయపడుతున్నారు. కూలీ పనులు చేసుకుని బతికే కార్మికులు, వీధి వ్యాపారులు, పండ్లు, కూరగాయలు అమ్ముకునే చిరువ్యాపారులు, ఆటోడ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ఎండల తీవ్రత తట్టుకోలేక ఇబ్బంది పడుతున్నారు.

తప్పని పరిస్థితిలో రోడ్లపై ఉండాల్సి వస్తోందని, వర్షాకాలంలో ఈ ఎండలు ఇలా ఉంటే బతికేదెలా అంటూ వాపోతున్నారు.

### రోహిణి పోయి మృగశిర వచ్చినా..

రోహిణి కార్తె పోయి మృగశిర కార్తె వచ్చి 10 రోజులవుతున్నా వర్షాలు పడక పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెట్ల కొమ్మలు ఎక్కడికక్కడ ఎండిపోతున్నాయి. ఉదయం 10 నుంచి రాత్రి 7 గంటల వరకు వడగాలులు వీస్తున్నాయి. నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారులుజనం లేక వెలవెలబోతున్నాయి. ఈ ఎండలు ఇలాగే ఉంటే కష్టమేనని ప్రజలు వాపోతున్నారు. అవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావొద్దని, ఒకవేళ వచ్చినా జాగ్రత్తలు తీసుకోవాలని, మంచినీళ్ళు ఎక్కువగా తీసుకోవాలని, మజ్జిగ, కొబ్బరినీళ్లు, చెరుకురసం, పండ్ల రసాలను తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

# తెర్లుమద్ది గ్రామంలో నూతన కూరగాయల మార్కెట్ ప్రారంభం



రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /జూన్ -18(అక్షరం న్యూస్ )

ముస్తాబాద్ మండలం తెర్లుమద్ది గ్రామంలోని కశీరు ప్రాంతంలో గ్రామ పంచాయితీ నిధులతో సుమారు రూ.2 లక్షల వ్యయంతో నిర్మించిన రోజువారీ కూరగాయల మార్కెట్‌ను గ్రామ సర్పంచ్ బైతి దుర్గమ్మ పంచాయతీ పాలక వర్గం స్థానికుల తో కలసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.గ్రామ ప్రజలకు నాణ్యమైన కూరగాయలు అందుబాటులో ఉండేలా ఈ మార్కెట్‌ను ఏర్పాటు చేయడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామంలో కూరగాయలు పండించే రైతులు తమ ఉత్పత్తులను నేరుగా ఈ మార్కెట్‌లో విక్రయించుకునే అవకాశం కలగడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.అనంతరం మార్కెట్‌లోని వ్యాపారుల వద్ద నుండి గ్రామ ప్రజలు కూరగాయలను కొనుగోలు చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సౌజన్య, వార్డు సభ్యులు బద్ధ రాములు, చిర్రం మహేష్, నెత్తేట్ల రమాదేవి, కొమ్మెట రాజు, కొమ్మెట రాజలింగయ్య, అంతడుపుల మంజుల దేవయ్య, కొండం విష్ణు, జంపెల్లి తిరుపతి, గోక దివ్యస్వామి, మామిండ్ల కనుకవ్వ శ్రీనివాస్ తో పాటు గ్రామ ప్రజలు, కూరగాయల వ్యాపారులు పాల్గొన్నారు.

# తాటి చెట్టు పై నుండి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలు



రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /జూన్ -18(అక్షరం న్యూస్ )

తాటి చెట్టు పైనుండి జారిపడి గీత కార్మికుడు తీవ్రంగా గాయపడ్డ సంఘటన ముస్తాబాద్ మండలంలోని చీకోడ్ గ్రామంలో శుక్రవారం జరిగింది. . గౌడ కార్మికులు తెలిపిన సమాచారం ప్రకారం.. చీకోడ్ గ్రామానికి చెందిన గున్నాల కిష్టా గౌడ్ ప్రతిరోజు తాటి చెట్లు ఎక్కి కల్లు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగానే శుక్రవారం సాయంత్రం చెట్లు గీయడానికి వెళ్లిన కిష్టా గౌడ్ అకస్మాత్తుగా తాటి చెట్టు పైనుండి ఒక్కసారిగా కిందపడ్డాడు.తీవ్ర గాయాలు కావడం తో ఆందోళన చెందిన తోటి గీత కార్మికులు వెంటనే చికిత్స కోసం ముస్తాబాద్ లోని ఒక ప్రయివేట్ ఆస్పత్రికి తీసుకెళ్లినట్లు తెలిపారుకిష్టా గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని గీత కార్మిక సంఘం నేతలు ప్రభుత్వాన్ని కోరారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

- పోతుగల్ సర్పంచ్ పెద్దిగారి యాదమ్మ శ్రీనివాస్



రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /జూన్ -18(అక్షరం న్యూస్ )

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య బోధన అందుతుందని, ప్రజలు తమ తమ పిల్లలకు ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని పోతుగల్ గ్రామ సర్పంచ్ పెద్దిగారి యాదమ్మ శ్రీనివాస్ అన్నారు.గురు వారం ఆమె పోతుగల్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తుందని, ప్రభుత్వ పాఠశాలలో అన్ని ఉచితంగా అందించి పిల్లల చదువులకు ప్రత్యేకంగా కృషి చేస్తుందని తెలిపారుప్రభుత్వ పాఠశాల లొ అందుబాటులో ఉన్న సౌకర్యాల ను సధ్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాదించాలని ఆకాంక్షించారు.. ఈ కార్యక్రమం లో ఉపసర్పంచ్ కొలకృష్ణ, ప్రధానోపాధ్యాయులు మామిండ్ల భూపతి, రేష్మ వార్డు సభ్యులు జంగరాజు,వెంకటేష్, విద్యార్థిని విద్యార్థులు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయలు,విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

# ఆకస్మిక తనిఖీలునకిలీ విత్తనాలు, బిల్లుల్లేని విక్రయాలపై కఠిన చర్యలు

- సీఐ బొల్లం రమేష్, మండల వ్యవసాయ అధికారి పున్నం చందర్



చిగురుమామిడి/జూన్ 18, అక్షరం న్యూస్

వర్షాకాలం సాగు సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందేలా మండల కేంద్రంలోని ఆగ్రోస్‌తో పాటు ప్రైవేట్ విత్తన దుకాణాల్లో అధికారులు గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.వ్యవసాయ కమిషనర్, జిల్లా కలెక్టర్ల ఆదేశాల మేరకు స్థానిక సీఐ రమేష్, మండల వ్యవసాయ అధికారి పున్నం చందర్‌రెడ్డి, ఎస్ఐ పృథ్వీధర్ గౌడ్‌లు తనిఖీల్లో పాల్గొన్నారు.దుకాణాల్లో ఉన్న ఎరువులు, విత్తనాల నిల్వలు, ధరల పట్టికలు, స్టాక్ రిజిస్టర్లు, ఇతర రికార్డులను అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ రమేష్, ఏఓ పున్నం చందర్‌రెడ్డి మాట్లాడుతూ.. లాభాపేక్షతో రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే సహించబోమని హెచ్చరించారు. ప్రతి దుకాణదారుడు స్టాక్ రిజిస్టర్‌ను సక్రమంగా నిర్వహించడంతో పాటు నిల్వల వివరాలను రైతులకు కనిపించేలా ప్రదర్శించాలని సూచించారు.విత్తన ప్యాకెట్లు, ఎరువుల బస్తాల విక్రయాలకు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలని, బిల్లుల్లేని విక్రయాలు జరిపితే దుకాణాల లైసెన్సులు రద్దు చేస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధిక ధరలకు విక్రయించినా చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులను ఇతర అవసరాలకు అక్రమంగా మళ్లించడం, కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్‌మార్కెట్‌లో విక్రయించడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ రమేష్, ఎస్ఐ పృథ్వీధర్ గౌడ్ హెచ్చరించారు.వానకాలం సాగు సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఏఓ పున్నం చందర్‌రెడ్డి తెలిపారు. మండలానికి అవసరమైన యూరియా, డీఏపీతో పాటు ఇతర ఎరువులు, విత్తనాలు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని,రైతులు గుర్తింపు పొందిన డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేసి, రసీదులను పంట కాలం పూర్తయ్యే వరకు భద్రపరుచుకోవాలని సూచించారు.

## ఘనంగా ఆంజనేయులు సాగర్ దంపతులు పెళ్లి రోజు వేడుకలు



శేరిలింగంపల్లి అక్షరం ప్రతినిధి:
అంజయ్య నగర్ డివిజన్ నాయకులు ఆంజనేయులు సాగర్ దంపతుల పెళ్లి రోజు కావడంతో డివిజన్ నాయకులు, సగర సంఘం నాయకులు, ఇతర మిత్ర బృందం పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలిపినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపిన అంజయ్య నగర్ డివిజన్ నాయకులు ఆంజనేయులు సాగర్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మీ అందరి ప్రేమ, అభిమానం, అనురాగం మాకు ఎల్లప్పుడూ ఉండాలని కోరారు, మా పెళ్లి రోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతూ... తమ విలువైన సమయాన్ని కేటాయించి ఫోన్ కాల్స్, సందేశాలు, సోషల్ మీడియా పోస్టుల ద్వారా శుభాకాంక్షలు తెలియజేయడం మాకు ఎంతో ఆనందాన్ని కలిగించింది. మా ప్రత్యేకమైన రోజును మరింత సంతోషకరంగా మార్చిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నా అని ఒక ప్రకటనలో తెలిపారు.

## విద్యార్థుల హాజరు శాతం పెంచాలి

- డీఈవో ప్రశాంత్ రెడ్డి



చిగురుమామిడి/జూన్ 18, అక్షరం న్యూస్,
చిగురుమామిడి మండలంలోని ఇందుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ను గురువారం జిల్లా విద్యాధికారి ప్రశాంత్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పాఠశాలలో 92 మంది విద్యార్థులు ఉండగా,కేవలం 58 మంది విద్యార్థులు హాజరు కాగా,పాఠశాల విద్యార్థుల హాజరు శాతం పెంచాలని పాఠశాల హెచ్ ఎం, ఎంఈఓ కి సూచించారు. అనంతరం తరగతి గదులను పరిశీలించి, ఫ్యాన్లకు, ట్యూబ్లైట్లకు ఉన్న దుమ్ముదులని,ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని, విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని అన్నారు. వంటగదిలను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించడం జరిగిందని, పదవ తరగతి గదిలో విద్యార్థులతో వారు మాట్లాడారు. విద్యార్థులు విద్యపై దృష్టి సారించి, విద్యా ప్రమాణాలు పెంపొందించుకోవాలని,100 శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా విద్యార్థులు కృషి చేయాలని అన్నారు. మీరు వెంట ఎంఈఓ జయప్రద తదితరులు ఉన్నారు.

## ప్రోటీన్లను అందించడంలో బాదం పప్పు, పల్లీలు.. ఏవి ఉత్తమంగా పనిచేస్తాయి..?



ప్రోటీన్ శరీరానికి అత్యంత అవసరమైన పోషకాల్లో ఒకటి. ఇది కండరాల పెరుగుదల, మరమ్మత్తులు, శరీర కణజాలాల నిర్మాణం, హార్మోన్లు, ఎంజైమ్‌ల ఉత్పత్తిలో కీలక పాత్ర పోషిస్తుంది. శాకాహారులు తమ రోజువారీ ప్రోటీన్ అవసరాలను తీర్చుకోవడానికి తరచూ బాదం, వేరుశెనగలను ఆహారంలో భాగం చేసుకుంటారు. అయితే ఈ రెండింటిలో ఏది ఎక్కువ ప్రోటీన్‌ను అందిస్తుందనే ప్రశ్న చాలామందిలో ఉంటుంది. ప్రోటీన్ పరంగా పరిశీలిస్తే వేరుశెనగలు బాదంతో పోలిస్తే కొద్దిగా ముందంజలో ఉంటాయి. 100 గ్రాముల వేరుశెనగల్లో సుమారు 25 నుంచి 26 గ్రాముల ప్రోటీన్ లభిస్తే, అదే పరిమాణంలోని బాదంలో దాదాపు 21 గ్రాముల ప్రోటీన్ ఉంటుంది. అలాగే పీనట్ బటర్‌లో 7.1 నుంచి 8 గ్రాముల వరకు ప్రోటీన్ ఉండగా, ఆల్మండ్ బటర్‌లో ఇది 5 నుంచి 6.7 గ్రాముల మధ్య ఉంటుంది. బాదం ఆరోగ్యకరమైన మోనోఅన్‌శాచురేటెడ్ కొవ్వులు, పీచు, విటమిన్-ఇ, మెగ్నీషియం, యాంటీ ఆక్సిడెంట్లకు మంచి వనరుగా గుర్తింపు పొందింది. ఇవి శరీరంలో వాపులను తగ్గించడంలో, గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి.

### గుండె ఆరోగ్యానికి..

గుండె ఆరోగ్య పరిరక్షణలో కూడా బాదం కీలక పాత్ర పోషిస్తుంది. ఇది చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్) స్థాయిలను తగ్గించడంలో, రక్తనాళాలను ఆక్సిడేటివ్ నష్టాల నుంచి కాపాడడంలో, రక్తపోటును నియంత్రించడంలో తోడ్పడుతుంది. బాదాన్ని పచ్చిగా, వేయించి లేదా ఆల్మండ్ బటర్, ఆల్మండ్ మిల్క్ రూపంలో కూడా తీసుకోవచ్చు. ఈ వైవిధ్యం దానిని ఆహారంలో సులభంగా చేర్చుకునేలా చేస్తుంది. వేరుశెనగలు ఆరోగ్యకరమైన కొవ్వులు, నియాసిన్, ఫోలేట్, విటమిన్-ఇ వంటి పోషకాలతో సమృద్ధిగా ఉంటాయి. అలాగే ఇందులో ఉండే రెస్వెరాట్రోల్ అనే యాంటీ ఆక్సిడెంట్ శరీరానికి పలు ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుందని చెబుతున్నారు. ధర పరంగా కూడా వేరుశెనగలు బాదంతో పోలిస్తే తక్కువ ఖర్చుతో లభిస్తాయి. అందువల్ల అధిక వ్యయం లేకుండా ప్రోటీన్‌ను పొందాలనుకునే వారికి ఇవి మంచి ఎంపికగా నిలుస్తాయి.

# స్తంభించిన మండల రెవెన్యూ వ్యవస్థ..!

- నిలిచిపోయిన రిజిస్ట్రేషన్లు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు
- మూడు నేలలుగా ఖాళీగా ఉన్న డిప్యూటీ తహసిల్దార్ పోస్ట్
- తహసిల్దార్ రమేష్ పై వెంటనే విచారణ జరపాలని బిఆర్ఎస్ నాయకులుడిమాండ్..



చిగురు మామిడి/జూన్ 18, అక్షరం న్యూస్
చిగురుమామిడి రెవెన్యూ కార్యాలయంలో తహసిల్దార్,డిప్యూటీ తహసిల్దార్ లేకపోవడంతో రిజిస్ట్రేషన్లు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, మరియు ఇతర కార్యకలాపాలు స్తంభించి పోవడంతో మండల ప్రజలు మండుటెండల్లో కార్యాలయం చుట్టూ తిరుగుతూ తీవ్ర ,20 తేదీ నుండి ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ ఉన్నందున కుల, ఆదాయ ధ్రువీకరణ, పత్రాల కోసం విద్యార్థులు,ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు ఉన్నారో లేరో చెప్పే నాధుడే లేడని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.గురువారం ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య ఆధ్వర్యంలో చిగురుమామిడి తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రెవిన్యూ కార్యాలయంలో ఖాళీగా ఉన్న కుర్చీలను,పలు అవసరాల నిమిత్తం రెవెన్యూ కార్యాలయానికి వచ్చి దీనంగా చూస్తున్న ప్రజలను చూసి అవాక్కయ్యారు. అనంతరం విలేకరుల సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ తహసీల్దార్ లేకవ రిజిస్ట్రేషన్లు, నిలిచిపోయాయని,3నెలలుగా డిప్యూటీ తహసిల్దార్ లేక ప్రజలు అవస్థలు వడుతున్నారని, రెవిన్యూ కార్యాలయాన్ని పట్టించుకునే నాధుడే లేడా అని వారు ప్రశ్నించారు. ఇటీవల బదిలీ అయిన తాహసిల్దార్ ముద్దసాని రమేష్ అవినీతి,అక్రమాలు చేశారని రెవెన్యూ కార్యాలయం ముందు సంబరాలు చేసుకోవడం,పలు పత్రికల్లో తహసిల్దార్ పై పలుమార్లు అవినీతి ఆరోపణలు వచ్చిన పట్టించుకోకపోవడం బాధాకరం అన్నారు. తాహసిల్దార్ ముద్దసాని రమేష్ ఆధ్వర్యంలో జరిగిన అవినీతి కార్యక్రమాలపై వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కొత్త తహసిల్దార్ ఇప్పటివరకు బాధ్యతలు తీసుకోలేదని,వెంటనే విధులలో చేరి ప్రజలకు సేవలు అందించేలా తగు చర్యలు తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ను,జిల్లా కలెక్టర్ ను వారు కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ మండల అధ్యక్షుడు హనుమాన్ల సత్యనారాయణ,మాజీమండల అధ్యక్షుడు రామోజు కృష్ణమాచారి,ఎండీ సర్వర్ పాషా,కూతురు శరబద్దన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# వర్షాకాలం వచ్చినా వానలు లేవు.. ఆందోళనలో రైతులు!





రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /జూన్ -18(అక్షరం న్యూస్ )
వర్షాకాలం ప్రారంభమై పదిహేడు రోజులు గడుస్తున్నా వరుణుడు కరుణించక పోవడంతో రైతాంగం ఆందోళన చెందుతోంది. సాధారణంగా మృగశిర కార్తెతోనే వర్షాలు ప్రారంభమై ఖరీఫ్ సాగుకు ఊపందుకోవాల్సి ఉండగా, ఈ ఏడాది వర్షాలు ముఖం చాటేయడంతో సాగు పనులు ముందుకు కదలడం లేదు. జిల్లాలో సాధారణ వర్షపాతంతో పోలిస్తే 70 శాతం లోటు నమోదు కావడం రైతులను కలవరపెడుతోంది

### ఆకాశం వైపు రైతుల చూపులు

వర్షాకాలం ప్రారంభమై రెండు వారాలకు పైగా గడిచినా చినుకు జాడ కనిపించకపోవడంతో రైతు లు ఆకాశం వైపు ఆశగా ఎదురు చూస్తున్నారు. మరో వారం రోజుల్లోనైనా విస్తారంగా వర్షాలు కురి స్తేనే ఖరీఫ్ సాగు గాడిన పడే అవకాశం ఉందని వ్యవసాయ శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా రైతాంగం వరుణుడి కరుణ కోసం నిరీక్షిస్తోందివానలు తక్కువ అంటున్నారు ఈ ఏడాది వానలు తక్కువగా ఉంటాయి అంటున్నారు ఇప్పటికే మృగశిర నుంచే మబ్బులు పడుతూ వానలు మొదలు కావాలి ఆరుద్ర వరకు విత్తనం వేసుకొని మొలక వస్తే బాగుండు ఇప్పటికీ వర్షాలు లేవు గత ఏడాది రోని కార్తిలో వర్షాలు కురవడంతో విత్తనాలు వేసుకున్న తర్వాత విత్తనాలు మొలకెత్తక మళ్ళీ జులైలో వేసుకోవలసి వచ్చింది ఈ ఏడాది వర్షాలు జాడే లేదురాజయ్య రైతు.

# చెరకు రసాన్ని రోజూ తాగవచ్చా.. నిపుణులు ఏమంటున్నారు..?



వేసవి కాలంలో చల్లగా, తీపిగా ఉండే చెరకు రసం చాలా మందికి ఇష్టమైన పానీయం. శరీరానికి తక్షణ శక్తిని అందించడంతోపాటు వేడిని తగ్గించడంలో ఇది సహాయపడుతుందని భావిస్తారు. అయితే చెరకు రసం ఆరోగ్యకరమైనదే అయినప్పటికీ, దాని పోషక విలువలు, పరిమితుల గురించి తెలుసుకోవడం కూడా అవసరం. ఒక మధ్యస్థ గ్లాసు చెరకు రసంలో సుమారు 25 నుంచి 30 గ్రాముల సహజ చక్కెర ఉంటుంది. ఇది దాదాపు ఐదు నుంచి ఆరు టీ స్పూన్ల చక్కెరకు సమానం. ఇందులో ప్రధానంగా సుక్రోజ్ ఉండగా, కొద్దిపాటి గ్లూకోజ్, ఫ్రక్టోజ్ కూడా ఉంటాయి. చక్కెర ద్రవరూపంలో ఉండటం వల్ల అది రక్తప్రసరణలోకి చాలా వేగంగా చేరుతుంది. దీంతో శరీరానికి తక్షణ శక్తి లభించి చల్లదన అనుభూతి చెందుతారు. అందుకే వేసవిలో చెరకు రసం తాగిన వెంటనే ఉల్లాసంగా అనిపిస్తుంది.

### రోజూ తీసుకోవచ్చా..

చెరకు రసంలో పొటాషియం, పాలీఫినాల్స్ వంటి కొన్ని పోషకాలు కూడా ఉంటాయి. పొటాషియం శరీరంలో ద్రవాల సమతుల్యతను కాపాడటానికి సహాయపడుతుంది. పాలీఫినాల్స్, యాంటీ ఆక్సిడెంట్లు వేడి వాతావరణంలో ఆక్సిడేటివ్ ఒత్తిడిని తగ్గించడంలో ఉపయోగపడతాయి. అయితే చెరకు రసాన్ని ప్రతిరోజూ తీసుకోవడం మంచిది కాదని నిపుణులు సూచిస్తున్నారు. మొత్తం చెరకు ముక్కలో ఉండే పీచు పదార్థం రసంలో చాలా తక్కువగా ఉంటుంది. అలాగే ఇందులో ప్రోటీన్ కూడా దాదాపు ఉండదు. ఫలితంగా రక్తంలో చక్కెర స్థాయిలు ఒక్కసారిగా పెరిగే అవకాశం ఉంటుంది. రక్తంలో చక్కెర వేగంగా పెరగడం వల్ల కొంతసేపు అధిక శక్తి లభించినట్లు అనిపించినా, ఆ తర్వాత శక్తి స్థాయి అకస్మాత్తుగా తగ్గిపోతుంది. దీంతో అలసట, నిద్రమత్తు, బద్ధకం వంటి లక్షణాలు కనిపించే అవకాశం ఉంటుంది.

### ఈ సమస్యలు ఉంటే వద్దు..

ఇన్సులిన్ రెసిస్టెన్స్, మధుమేహం లేదా యాసిడ్ రిఫ్లక్స్ సమస్యలతో బాధపడుతున్న వారు చెరకు రసాన్ని తరచూ తీసుకోవడాన్ని నివారించడం మంచిదని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. ఎందుకంటే ఇది రక్తంలో చక్కెర స్థాయులపై ప్రభావం చూపిస్తుంది. చెరకు రసం విషయంలో మరో ముఖ్యమైన అంశం పరిశుభ్రత. రసం కంటే దానిని తయారు చేసే ప్రదేశం పరిశుభ్రంగా ఉండటం మరింత ముఖ్యం. పరిశుభ్రత లేని ప్రాంతాల్లో తయారయ్యే రసంలో సూక్ష్మజీవులు చేరి ఆరోగ్య సమస్యలకు కారణమయ్యే అవకాశం ఉంటుంది.

### అప్పుడప్పుడు తీసుకోవచ్చు..

అందువల్ల చెరకు రసాన్ని పూర్తిగా మానేయాల్సిన అవసరం లేదు. అయితే దానిని రోజువారీ ఆరోగ్య పానీయంగా కాకుండా అప్పుడప్పుడు తీసుకునే వేసవి శీతల పానీయంగా భావించడం మంచిది. పరిమిత మోతాదులో, పరిశుభ్రమైన ప్రదేశాల్లో తయారైన చెరకు రసాన్ని తీసుకుంటే దాని రుచి, తాజాదనాన్ని ఆస్వాదించడంతోపాటు ఆరోగ్యపరమైన ప్రమాదాలను కూడా తగ్గించుకోవచ్చని నిపుణులు తెలియజేస్తున్నారు.

# పలు కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేసిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య.



యాదాద్రి భువనగిరి జిల్లా/ యాదగిరిగుట్ట / అక్షరం న్యూస్ / జూన్ 8 / :రాజపేట మండలంలో పలు బాధిత కుటుంబాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బిర్ల అయిలయ్య పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు..రాజపేట మండలం నర్సపూర్ గ్రామంలో పొన్నోజు గణేష్ మృతిచెందగా వారి కుటుంబాన్ని..అదే గ్రామానికి చెందిన ప్రవీణ్ కుమార్ అనారోగ్యంతో బాధపడుతుండగా వారి కుటుంబాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు.. రాజపేట మండలం చల్లురు గ్రామంలో దిడిగా కరుణాకర్ అనారోగ్యంతో మృతి చెందగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కరుణాకర్ మృతదేహానికి నివాళులర్పించి వారి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసారు.. రాజపేట మండలం పారుపల్లి గ్రామంలో రావుల సొక్కమ్మ అనారోగ్యంతో మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పరామర్శించారు.

# మృతురాలు కుటుంబానికి బియ్యం పంపిణీ చేసిన బీర్ల ఫౌండేషన్ చైర్పర్సన్ శ్రీమతి బీర్ల అనిత.



యాదాద్రి భువనగిరి జిల్లా/ యాదగిరిగుట్ట / అక్షరం న్యూస్ / జూన్ 8 / : గత కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో మరణించిన ఏమ సత్తమ్మ కుటుంబానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలన్న సతీమణి బీర్ల ఫౌండేషన్ చైర్పర్సన్ శ్రీమతి బీర్ల అనిత ఆదేశానుసారం గురువారం రోజు తిర్మలాపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు చాడ కర్ణాకర్ రెడ్డి ఆధ్వర్యంలో బియ్యం పంపిణీ చెయ్యడం జరిగింది .ఇట్టి కార్యక్రమంలో ఏ.ఏం.సి సూపర్ ఛైర్మెన్ ఐనాల మహేందర్ రెడ్డి ,గ్రామ సూపర్ సర్పంచ్ దొనికెన వెంకటేశం, మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు వంగ నారాయణ రెడ్డి ,మాజీ సర్పంచ్ వంగ రాజిరెడ్డి ,మాజీ ఉపసర్పంచ్ సముద్రాల వెంకటేశం, మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు అరె నర్సింహులు , జల్తారు లక్ష్మణ్ ,బోయిని కొండల్ , తిగుళ్ల బాలకృష్ణ , మాధాపురం శంకరయ్య ,వెలిదె కనకరాజు ,పెల్లి శ్రీశైలం, దొనికెన జహంగీర్, ఎస్.కే మౌలానా,తుమ్మల నర్సింహులు,రత్నాల ఐలేష్, రత్నాల చంద్రశేఖర్,నూకల బాబు, ఏమ శ్రీను, ఏమ కాషయ్య,ఏమ ప్రవీణ్,ఏమ గణేష్ తదితరులు పాల్గొన్నారు...

# తెలంగాణ రాష్ట్రం లో ఫీజు నియంత్రణ చట్టం తీసుకు రావాలి

**● అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రయివేటు పాఠశాల ల మీద చర్యలు తీసుకోవాలి.**

**●కాసుల నరేష్ ఎస్ ఎఫ్ ఐ జిల్లా ఉపాధ్యక్షులు కాసుల నరేష్ .**



యాదాద్రి భువనగిరి జిల్లా/ అక్షరం న్యూస్/ యాదగిరిగుట్ట / జూన్ 18 / : గురువారం రోజు ఎస్ ఎఫ్ ఐ ఆలేరు మండల కమిటీ ఆధ్వర్యంలో ఆలేరు మండల కేంద్రం లోని ఎం ఈ ఓ ఎర్ర లక్ష్మి గారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ ఎఫ్ ఐ జిల్లా ఉపాధ్యక్షులు కాసుల నరేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలని అలాగే ఆలేరు మండల పట్టణ లోని ప్రైవేటు పాఠశాలలో అడ్మిషన్ ,బస్సు,పుస్తకాలు,యూనిఫాం పేర్లతో అధిక ఫీజులు తీసుకుంటున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ప్రతి విద్య సంస్థ ఫీజు నిర్మాణాన్ని ప్రభుత్వ పర్యవేక్షణలో అమలు చేయాలని , ఫీజుల భారం వల్ల విద్యార్థులు చదువు మానేయకుండా చర్యలు తీసుకోవాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఎఫ్ ఐ మండల ఉపాధ్యక్షులు మద్దెల సాయి గణేష్ ,సభ్యులు సాయిని కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు...

# ప్రమాదవశాస్తూ కళాలి కార్మికుల మృతి

ఓదెల/ పెద్దపల్లి జూన్ 18 (అక్షరం న్యూస్)

తాటి చెట్టు పైనుండి పడి కలాలి కార్మికుడి మృతి బతుకు జీవన పోరాటంలో కలాలి కార్మికుడు మృతి చెందిన సంఘటన భీమరపల్లి గ్రామంలో చోటు చేసుకుంది స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గురువారం సాయంత్రం దాదాపు 4 5 గంటల సమయంలో ఓదెల గ్రామానికి చెందిన ఐలు బిక్షపతి గౌడ్ వయసు దాదాపు 53 సంవత్సరాలు వృత్తి రిత్య భాగంగా. మండలంలోని భీమరపల్లి గ్రామ శివారులో తాటి చెట్టు ఎక్కుతూ ప్రమాదశాస్తు కిందపడి మృతి చెందాడని తెలిపారు గత 20 25 సంవత్సరాల నుండి గీత కార్మికుడిగా జీవితం కొనసాగిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు మృతి చెందిన బిక్షపతి. కల్లు గీత కార్మికుడికి ముగ్గురు ఆడపిల్లలు ఈ నేపథ్యంలో ఇద్దరికీ వివాహం చేయడం జరిగిందని చిన్న కూతురుకు మంచి సంబంధం చూసి వివాహం. చేయాలని చాలామందితో చర్చించేవాడని ఇంతలోనే ఇలాంటి దురదృష్ట సంఘటన జరిగిందని కుటుంబాన్ని పోషించే బిక్షపతి లేదని తెలిసినా కుటుంబ సభ్యులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారని తండ్రి మృతితో ఆ కూతురు మృతుడి భార్య విలపిస్తున్న తీరు అందర్నీ కంటతడి పెట్టించింది ఎవరికి ఎలాంటి కష్టం రాకుండా తాను ఒక్కడినే కష్టపడుతూ వృత్తిరీత్యా గీతా కార్మికుడిగా మంచి పేరున్న వ్యక్తి బిక్షపతి గౌడ్ అని పలువురు చర్చించుకుంటున్నారు బిక్షపతి గౌడ్ మృతితో ఓదెల గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి అందరితో కలివిడిగా తిరిగే వ్యక్తి ఒక్కసారిగా వికటజీవిగా



కనబడడంతో పలువురు జీర్ణించుకోలేకపోయారు ఇప్పటిదాకా మాతో మాట్లాడి తాటి చెట్టు ఎక్కి దానిపై నుండి పడి మృతి చెందిన బిక్షపతి గౌడ్ ను చూసి కన్నీళు పెట్టుకున్న సంఘటన చాలామందిని కలిసి వేసింది చాలా మంచి వ్యక్తిని అలాంటి వ్యక్తికి ఇలాంటిది జరగడం దురదృష్టకరమని చాలామంది ఆవేదన గురయ్యారు

వెంటనే ప్రభుత్వం కుటుంబాన్ని ఆదుకొని ఆర్థిక సాయం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారుసంఘటన స్థలానికి పూజల గీత పారిశ్రామిక సంఘం అధ్యక్షులు నాగపురి రవి గౌడ్ చేరుకొని ప్రమాదానికి గల కారణాలను ఆరా తీశారు ఈ సందర్భంగా గీత పారిశ్రామిక సంఘం అధ్యక్షులు నాగపురి రవి గౌడ్ మాట్లాడుతూ బతుకు జీవన పోరాటంలో అసువులు బాసిన బిక్షపతి గౌడ్ మృతి చెందడం చాలా బాధాకరమైన విషయమని వారి కుటుంబ సభ్యులకు ప్రత్యేక ప్రగాఢ సానుభూతి తెలియపరుస్తూ మృతుడి కుటుంబానికి అండగా ఉంటూ కుటుంబాన్ని ఆదుకునే విధంగా అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు

# ఏరియా వర్క్ షాప్ లో ఉన్న సమస్యలపై వర్క్ షాప్ హెచ్.ఓ.డి జే.కిష్టఫర్ కు మెమరాండం ఇచ్చిన ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎండి రజాక్.



భద్రాద్రి కొత్తగూడెం/ కొత్తగూడెం/ జూన్ 18 / అక్షరం న్యూస్ –:

ది.18/06/2026 గురువారం రోజున కొత్తగూడెం ఏరియాలోని ఏరియా వర్క్ షాప్ లో ఉన్న సమస్యలపై కొత్తగూడెం ఏరియా ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎండి రజాక్ ఆధ్వర్యంలో ఫిట్ కమిటీ మరియు నాయకులతో కలిసి వర్క్ షాప్ హెచ్.ఓ.డి, జే క్రిస్టఫర్ కు పలు సమస్యలపై మెమరాండం ఇవ్వడం జరిగింది, వాటిలో ముఖ్యంగా వర్క్ షాప్ నందు టెక్నీషియన్స్ రిటైర్మెంట్, అవుచున్నారు, వారి స్థానాల్లో ఎలక్ట్రీషన్స్ మరియు ఫిట్టర్స్ లను త్వరగా భర్తీ చేయాలి అని వర్క్ షాప్ నందు కొత్తగూడెం ఏరియా మరియు సత్తుపల్లి ఏరియా ల వర్క్స్ చేయడం జరుగుతుంది, వర్క్స్ ఎక్కువగా ఉన్నాయి అని ప్లేడే లు తక్కువగా ఉండడం వల్ల ఒక్కొక్కరికి ప్లే డే మూడు నెలలకి ఒకసారి వస్తుంది, కావున ప్లే డే లను పెంచగలరు అని అన్నారు, వర్క్ షాప్ స్టోర్స్ నందు క్లర్క్ మరియు స్టోర్ మెటీరియల్ ఇష్యూ చేయడానికి జనరల్ అసిస్టెంట్ ను ఏర్పాటు చేయాలి అని వర్క్ షాప్ నందు టి, టిఫిన్, ఉద్యోగులకు సంబంధించిన క్యాంటీన్ హాల్ను త్వరగా ఏర్పాటు చేయాలి అని సింగరేణి సంస్థ ఇచ్చే ఉత్తమ ఉద్యోగి అవార్డును వర్క్ షాప్ ఉద్యోగులకు కూడా ప్రతి సంవత్సరం ఇచ్చే విధంగా చూడాలి అని

వర్క్ షాప్ నందు పంపు సెక్షన్, మిషన్ షాప్ సెక్షన్, ఇండోర్ సెక్షన్, ఫ్యాబ్రికేషన్ సెక్షన్లకు ఈవోటీ నీ త్వరగా ఏర్పాటు చేయాలి అని వర్క్ షాప్ ఉద్యోగులకు సీఎం పీఎఫ్ లెక్కల స్లిప్స్ త్వరగా ఇచ్చే విధంగా ఏర్పాటు చేయాలి అని కాలనీలలో మరియు 3.3/33 కెవి నందు బ్యాక్ షిఫ్టో వర్క్ చేసే టెక్నీషియన్స్ మరియు ఏం.వి డ్రైవర్స్ కు, జనరల్ అసిస్టెంట్లకు రేన్ కోట్లు (ప్యాంట్ షర్ట్) ఇచ్చే విధంగా చూడాలని కోరడం జరిగింది, మంగళవారం జరిగిన ట్రైపాటెడ్ మీటింగ్ లో జరిగిన విషయాలను కూడా తెలియజేయడం జరిగింది, అలాగే కారుణ్య నియమాకాల్లో పెండింగ్లో ఉన్న 355 ఉద్యోగుల పిల్లలకు నియామక పత్రాలు ఇప్పియడంలో విశేష కృషి చేసిన ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల చైర్మన్ శ్రీ జనక్ ప్రసాద్ కు కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది, పైన తెలిపిన సమస్యలను వర్క్ షాప్, హెచ్ఓడికి వివరంగా తెలియజేయడం జరిగింది, వారు సానుకూలంగా స్పందించి పరిష్కరించే విధంగా చూస్తారని హామీ ఇవ్వడం జరిగింది, ఈ కార్యక్రమంలో వర్క్ షాప్ ఇంజనీర్స్ టీ.అనిల్,ఏ ఉపేందర్ బాబు, ఫిట్ కార్యదర్శి ఎండి సత్తార్ పాషా, బ్రాంచ్ కార్యదర్శి మెంగాని అశోక్, సూపర్వైజర్స్ బి. వెంకట్ రామ్, రమేష్ బాబు భాను చందర్, ఎస్డి యా కుబుద్దీన్, నాయకులు చందులాల్, తిరుపతి, సముద్రాల శ్రీనివాస్, గౌస్ మహమ్మద్, బొజ్జ వెంకటస్వామి, బెల్లంకొండ, బాబుద్దిన్, ఖాజా పాషా, దుర్గ ప్రసాద్, కొప్పుల కుమార్, ప్రభాకర్, ఏసురత్నం, మహేశ్వరరావు, స్వామి, వేణుగోపాల్, సుందర్ రాజ్, కట్ట నరసింహారావు శ్రీకాంత్ శర్మ, ఏ రవికుమార్, కిషన్ సత్యనారాయణ, ఎస్కే రియాజ్ బండి సంపత్, నరేందర్, కనకయ్య, పరశురాం, మేకల గిరిబాబు, బత్తుల శ్రీనివాస్, వీర రామకృష్ణ, వెంకటేశ్వరరావు, కె.వి.రావు, అజ్గర్ అలీ, రాజయ్య, టి శ్రీనివాస్, టిఆర్ఎస్ రాజు, పి ఆర్ సి రెడ్డి, డి సమ్మయ్య, అల్తాఫ్, ముజాహిద్, చిప్ప నరేష్, మహేష్, శ్రీహరి, ఎల్లయ్య, మహిళా ఉద్యోగులు వెంకట దుర్గ, వాసంతిక, రమణ, నాయకులు, కార్యకర్తలు, మిత్రులు, శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.

# పొంగులేటిపై కేటీఆర్ విమర్శలు అర్ధరహితం

భద్రాద్రి కొత్తగూడెం అశ్వారావుపేట / జూన్ 18 / అక్షరం న్యూస్ –: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేస్తున్న విమర్శలను మున్సిపాలిటీ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిన్నంశెట్టి సత్యనారాయణ, ఆత్మ కమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రరావు, జిల్లా కాంగ్రెస్ నాయకుడు తుమ్మ రాంబాబు తదితరులు తీవ్రంగా ఖండించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాజకీయ లబ్ధి కోసమే ప్రతిపక్షాలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాల అంశాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఇటువంటి వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు.ప్రజలతో నిరంతరం మమేకమై, వారి సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని ప్రజల నుంచి దూరం చేయడం కేటీఆర్‌కు సాధ్యం కాదన్నారు. ప్రజా సేవలో ముందుండే నాయకులపై అసత్య ప్రచారాలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. మంత్రి పొంగులేటిపై దిగజారుడు విమర్శలు చేస్తే కాంగ్రెస్ శ్రేణులు సహించబోవని హెచ్చరించారు.

## పొంగులేటిని ప్రజల నుంచి దూరం చేయలేరు

ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న



మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని ప్రజల నుంచి దూరం చేయాలన్న ప్రతిపక్షాల ప్రయత్నాలు ఎప్పటికీ ఫలించవని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ప్రజల ఆదరణ, విశ్వాసంతో ముందుకు సాగుతున్న నాయకుడిపై చేసే విమర్శలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు.

## దృష్టి మళ్లించే రాజకీయమే

గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలపై సమాధానం చెప్పాల్సిన బీఆర్ఎస్ నాయకులు ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజలు వాస్తవాలను గమనిస్తున్నారని, అసత్య ప్రచారాలను తిప్పికొడతారని పేర్కొన్నారు.

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధినే లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తోందని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతులను పట్టించుకోని కేంద్ర ప్రభుత్వం



- సన్నవడ్ల కు బోనస్ ఇచ్చిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానిదే..
- వచ్చే పంట కాలానికి సన్నవడ్లకు బోనస్ చెల్లిస్తాం.
- రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే ఎరువులు రాష్ట్రానికే చెందాలి..
- ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు.

పెద్దపల్లి జిల్లా / పెద్దపల్లి టౌన్ / జూన్ 18 / అక్షరం న్యూస్ –:

రైతుల పట్ల కక్ష సాధింపు చర్యలు విడాలని కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. ప్రభుత్వ విప్ విజయరామణరావు హైదరాబాద్ అసెంబ్లీ సీఎల్పీ కార్యాలయం లో గురువారం రోజున ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో తెలంగాణ ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు మాట్లాడుతూ. ఇక్కడ ఉత్పత్తి అవుతున్న యూరియా ఎరువులను మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాలకు రవాణా చేయడం వల్ల తెలంగాణలో కోరుత ఏర్పడే అవకాశం ఉందన్నారు. ఏప్రిల్, మే మాసాలకు సంబంధించిన 47 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఇంకా రాష్ట్రానికి రావాల్సి ఉందని చెప్పారు. ఈ విషయంలో కేంద్ర మంత్రులు ఇద్దరు ఏనాడు పట్టించుకోలేదని విజయ రమణారావు తెలిపారు. రైతు గోస పేరిట యాత్రలు చేసిన బిజెపి నేతలకు యూరియా సమకూర్చే ఆలోచన లేదన్నారు. రాష్ట్రంలో ఎనిమిది మంది ఎంపీలు ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నప్పటికీ రైతు సమస్యలను ఏనాడు పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. రైతు గోస ఏమో కాని.. బిజెపి నేతల గోసే చూస్తే జాలి వేస్తోందని చెప్పారు. గతంలో కేసీఆర్ సన్నవడ్ల కు ఎన్నడు బోనస్ ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సన్నవడ్ల కు ఇస్తున్నదని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల 2 వేల కోట్ల బోనస్ రైతులకు చెల్లించడం జరిగిందని చెప్పారు. అలాగే, రైతులకు ఎలాంటి సమస్యలు లేకుండా వడ్ల కొనుగోళ్లు పూర్తి చేసినట్టు చెప్పారు. రాష్ట్రంలో 75 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లను సేకరించడం జరిగిందని చెప్పారు. మార్క్ఫెడ్ ద్వారా 15 లక్షల మెట్రిక్ టన్నుల మక్కలను సేకరించినట్టు చెప్పారు. ప్రభుత్వానికి మక్కల కొనుగోలు వల్ల నష్టం వచ్చినప్పటికీ రైతుల కోసం భరించడం జరిగిందన్నారు. సన్నవడ్ల కు మళ్లీ బోనస్ చెల్లించడం జరుగుతుంది అని స్పష్టం చేశారు. వరి పంట వేయవద్దని తమ ప్రభుత్వం ఏనాడు చెప్పలేదని, పంటల మార్పిడి వల్ల భూసారం పెరుగుతుందని అలాగే, పామాయిల్ తోటల పెంపకం లాభాసటి వ్యాపారం అని రైతులను చైతన్యం చేయడం జరిగిందని చెప్పారు. భవిష్యత్తు అవసరాల కోసం పామాయిల్ విత్తనాలను ఇతర దేశాల నుండి దిగుమతి చేసుకోకుండా రాష్ట్రంలోనే తోటల పెంపకం చేయాలని మాత్రమే రైతులకు చెప్పడం జరిగిందన్నారు. కేటీఆర్, హరీష్ రావులు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని విమర్శించడమే ధ్యేయంగా పెట్టుకున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడానికి ఇద్దరు పోటీపడుతున్నారని చెప్పారు.

## ఏజెంట్ల అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న


- మాజీ మంత్రివర్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి ...



యాదాద్రి భువనగిరి జిల్లా/ అక్షరం న్యూస్/ యాదగిరిగుట్ట / జూన్ 18 / : గురువారం రోజు ఆలేరు నియోజకవర్గంలో, యాదగిరిగుట్ట మండలం, వంగపల్లి గ్రామంలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఫంక్షన్ హాల్ లో మాజీ ఎమ్మెల్యే, మాజీ ప్రభుత్వ విప్, ఆలేరు నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీమతి గొంగిడి సునిత మహేందర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ప్రత్యేక ఓటరు జాబితా పై బూత్ ఏజెంట్ల అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ మంత్రివర్యులు, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి అనంతరం బూత్ ఏజెంట్లకు ఎస్ ఐ ఆర్ పై దిశ నిర్దేశం చేశారు, ఈ కార్యక్రమంలో సభ్యత్వ నమోదు ఇంచార్జ్ మాజీ నల్గొండ జెడ్పీ చైర్మన్ బండ నరేందర్ రెడ్డి , యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు కంచర్ల రామకృష్ణ రెడ్డి , సూర్యాపేట జిల్లా అధ్యక్షులు మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ , మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్య గౌడ్ , మాజీ మదర్ డెయిరీ చైర్మన్ లింగాల శ్రీకర్ రెడ్డి , భువనగిరి పార్లమెంట్ ఇంచార్జ్ క్యామ మల్లేష్ , రాష్ట్ర ఉపాధ్యక్షులు తుంగ బాలు , బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కల్లూరి రామచంద్ర రెడ్డి , బిఆర్ఎస్ పార్టీ బూత్ ఏజెంట్లు, జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు..

## పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్న ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య.

యాదాద్రి భువనగిరి జిల్లా/ అక్షరం న్యూస్/ యాదగిరిగుట్ట / జూన్ 18 /



: యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం ఫకీరుగూడెం గ్రామంలో నిర్వహించిన పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే కు ఘన స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పెద్దమ్మ తల్లి విగ్రహాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని, గ్రామంలో సుఖశాంతులు, ఐశ్వర్యాలు నెలకొనాలని ప్రార్థించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు గ్రామ దేవతల ఆలయాలు ప్రతీకలని అన్నారు. గ్రామాల్లో ప్రజల ఐక్యత, భక్తి, ఆధ్యాత్మికతకు ఇలాంటి ఆలయాలు కేంద్ర బిందువులుగా నిలుస్తాయని పేర్కొన్నారు. పెద్దమ్మ తల్లి ఆశీస్సులతో గ్రామం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణకు కట్టుబడి ఉందని తెలిపారు. ప్రజల సహకారంతో గ్రామాల్లో ఆలయాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. భక్తి భావంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం గ్రామ ప్రజల ఐక్యతకు నిదర్శనమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు...

## తాటి చెట్టు పై నుండి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలు



రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /జూన్ – 18(అక్షరం న్యూస్ )

తాటి చెట్టు పైనుండి జారిపడి గీత కార్మికుడు తీవ్రంగా గాయపడ్డ సంఘటన ముస్తాబాద్ మండలంలోని చీకోడ్ గ్రామంలో గురువారం జరిగింది. . గౌడ కార్మికులు తెలిపిన సమాచారం ప్రకారం.. చీకోడ్ గ్రామానికి చెందిన గున్నాల కిష్టా గౌడ్ ప్రతిరోజు తాటి చెట్లు ఎక్కి కల్లు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగానే శుక్రవారం సాయంత్రం చెట్లు గీయడానికి వెళ్లిన కిష్టా గౌడ్ అకస్మాత్తుగా తాటి చెట్టు పైనుండి ఒక్కసారిగా కిందపడ్డాడు.తీవ్ర గాయాలు కావడం తో ఆందోళన చెందిన తోటి గీత కార్మికులు వెంటనే చికిత్స కోసం ముస్తాబాద్ లోని ఒక ప్రయివేట్ ఆస్పత్రికి తీసుకెళ్లినట్లు తెలిపారుకిష్టా గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని గీత కార్మిక సంఘం నేతలు ప్రభుత్వాన్ని కోరారు

# ఆధునికీకరణతో రాతి-చెరువు రూపురేఖలు మారుతాయి

- రూ.2.30కోట్లతో రాతి చెరువు అభివృద్ధిపనులు చేపడుతున్నాం.
- అభివృద్ధికి చిరునామాగా పాల్వంచను తీర్చిదిద్దుతాం.
- నియోజకవర్గంలో ముమ్మరంగా అభివృద్ధి పనులు.
- ప్రజా సమస్యల శాశ్వత పరిష్కారమే ధ్యేయంగా నిరంతర కృషి.
- నిర్ణీత కాలంలోగా నాణ్యతతో పనులు ముగించేలా చర్యలు తీసుకుంటాం.
- • ప్రతిపల్లెకు, బస్తీకి మౌలిక వసతులు కల్పిస్తాం.
- రూ.2.76కోట్ల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన.
- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు.



భద్రాద్రి కొత్తగూడెం/ పాల్వంచ / జూన్ 18 / అక్షరం న్యూస్ –: రూ.2.30కోట్ల నిధులతో చేపట్టనున్న రాతిచెరువు ఆధునికరణతో చెరువు రూపురేఖలు మారుతాయని, రాతి చెరువు పరిసరాలు ఎంతగానో ఆహ్లాదంగా మారుతాయని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. నియోజకవర్గంలో రూ.2.30 కోట్లతో చేపట్టనున్న రాతి చెరువు అభివృద్ధి పనులకు, అలాగే రూ.76 లక్షల నిధులతో నిర్మించనున్న రెండు నూతన రోడ్ల నిర్మాణ పనులకు గురువారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభల్లో ఆయన మాట్లాడుతూ... రూ.2.30 కోట్లతో రాతి చెరువు సుందరీకరణ పనులు, వాకింగ్ ట్రాక్‌ల నిర్మాణం, ఇతర ఆధునీకరణ పనులను వేగవంతం చేస్తామని తెలిపారు. అభివృద్ధికి చిరునామాగా పాల్వంచను తీర్చిదిద్దుతామని, నియోజకవర్గంలో ముమ్మరంగా అభివృద్ధి పనులు సాగుతున్నాయని వివరించారు. ప్రజా సమస్యల శాశ్వత పరిష్కారమే ధ్యేయంగా తాము నిరంతర కృషి చేస్తున్నామని, నియోజకవర్గ పరిధిలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా మరిన్ని నిధులు తీసుకువస్తామని స్పష్టం చేశారు. ఈ పనుల్లో ఎలాంటి అలసత్వం వహించకుండా, పూర్తి నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత కాలవ్యవధిలోగా పనులు ముగించేలా చర్యలు తీసుకుంటామని, ఆ మేరకు పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను, కాంట్రాక్టర్లను ఆయన ఆదేశించారు. భవిష్యత్తులో కొత్తగూడెం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని, ప్రతిపల్లెకు, బస్తీకి మౌలిక వసతులు కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, డిప్యూటీ మేయర్ లలిత కుమారి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబా వీసంశెట్టి పూర్ణచంద్రరావు ఉప్పుశెట్టి రాహుల్, తహసిల్దార్ దారా ప్రసాద్, ఇంచార్జీ కమిషనర్ విజయానంద్ ఎలక్ట్రికల్ ఏ డి ఇ అబ్దుల్ రెహమాన్, కార్పొరేటర్లు వీసంశెట్టి విశ్వేశ్వరరావు గుర్రం వెంకటేశ్వర్లు నామ కీర్తి గొర్లె అన్నపూర్ణ, కాల్వ భాస్కర్, దున్నపోతుల మణి, దంతబోయిన నరేష్, నాయకులు వీ పద్మజ, డి సుధాకర్, అన్నారపు వెంకటేశ్వర్లు, నిమ్మల రాంబాబు, శెనగారపు శ్రీనివాసరావు, రెహమాన్, గిరి, గౌస్ పాషా, మస్తాన్, అహ్మద్ జానీ, కరీం, గొర్లె నరేష్, నామ పండు, ఆలపాటి ప్రసాద్, అల్లి వెంకటేశ్వర్లు వివిధ శాఖల డి ఈ లు ఏఈలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# పిల్లల గదిలో ఏసీ ఉష్ణోగ్రత ఎంత ఉండాలో తెలుసా?



ఈ రోజుల్లో చాలా ఇళ్లలో పిల్లలు కూడా ఏసీ గదుల్లోనే నిద్రపోతున్నారు. అయితే ఏసీని సరిగ్గా వాడకపోతే, అది పిల్లల ఆరోగ్యంపై ప్రభావం చూపే అవకాశం ఉంది. అందుకే తల్లిదండ్రులు కొన్ని ముఖ్యమైన జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి.

### గది ఉష్ణోగ్రత ఎంత ఉండాలి?

పిల్లల గదిలో ఉష్ణోగ్రత $23^{\circ}C$ - $27^{\circ}C$ మధ్య ఉండటం మంచిది. చాలా తక్కువ ఉష్ణోగ్రత ఉంటే జలుబు, దగ్గు, అలర్జీ సమస్యలు రావచ్చు. గాలి నేరుగా తగలకుండా చూడండి. ఏసీ గాలి పిల్లలపై నేరుగా పడకూడదు. ఇది చర్మం, శ్వాసకు ఇబ్బందులు కలిగించవచ్చు.

### సరైన దుస్తులు అవసరం

పిల్లలకు తేలికైన, సౌకర్యవంతమైన బట్టలు వేయాలి. శరీరం పూర్తిగా కప్పేలా ఉండాలి. ఎప్పుడూ ఏసీ ఆన్‌లో ఉంచొద్దు. 3-4 గంటలకొకసారి ఏసీ ఆపడం మంచిది. కొంతసేపు గదిలో సహజ గాలి రావడం అవసరం. ఆస్తమా ఉన్నవారు, శ్వాసకోశ సమస్యలు ఉన్నవారు, చర్మ అలర్జీలు ఉన్నవారు, జ్వరం లేదా ఇన్ఫెక్షన్ ఉన్నవారు ఈ పరిస్థితుల్లో ఉన్న పిల్లలు జాగ్రత్తగా ఉండాలి. పిల్లలు ఏసీ గదిలో నిద్రపోవడం తప్పు కాదు. కానీ సరైన ఉష్ణోగ్రత, గాలి దిశ, దుస్తులు వంటి విషయాలు జాగ్రత్తగా చూసుకుంటేనే వారు ఆరోగ్యంగా ఉంటారు. చిన్న జాగ్రత్తలు తీసుకుంటే పెద్ద సమస్యలను నివారించవచ్చు.

# సాలీడు కాటు ప్రమాదకరమైందా.. సాలీడు కాటు వేస్తే ఏమవుతుంది..?



సినిమాలో పీటర్ పార్కర్ ఒక స్పైడర్ కాటు వల్ల సూపర్ పవర్స్ పొందాడు. కానీ నిజ జీవితంలో మాత్రం స్పైడర్ బైట్ ప్రమాద కరంగా మారవచ్చు. Chris Keegan అనే యూకే వ్యక్తికి జరిగిన ఘటనే దీనికి ఉదాహరణ. అతని చేతిపై ఉన్న చిన్న కాటును మొదట పట్టించుకోలేదు. తర్వాత అది ఎర్రగా మారడంతో మెడిసిన్ తీసుకున్నాడు. కానీ పరిస్థితి క్రమంగా క్షీణించడం మొదలు పెట్టింది. చేయి వాపులకు గురై, ఊదా రంగులోకి మారి, బౌలింగ్ బాల్ సైజ్‌కి చేరింది. చివరకు ఆసుపత్రికి వెళ్లగా, ఇన్ఫెక్షన్ వ్యాపించకుండా ఉండేందుకు శస్త్రచికిత్స చేయాల్సి వచ్చింది. సాధారణంగా సాలీడు కాట్లు హానికరం కావు. చాలా సందర్భాల్లో వాటిని అందరూ అస్సలు గమనించకపోవచ్చు. కానీ కొందరిలో చర్మం ఎర్రబారడం, నొప్పి, వాపు, చర్మంపై పుండ్లు వంటి లక్షణాలు కనిపించవచ్చు. వైద్యుల ప్రకారం నిజంగా సాలీడు కాటు వేసిందో లేదో కచ్చితంగా చెప్పడం కూడా కష్టమని సాలీడు కాటును చూసినప్పుడే దానిని నిర్ధారించవచ్చునని వారు చెబుతున్నారు.

### కొన్ని రకాల సాలీడ్లు మాత్రమే ప్రమాదకరం..

ప్రపంచంలో కొద్ది రకాల సాలీడ్లు మాత్రమే మనుషులకు ప్రమాదకరం. వాటిలో విడో స్పైడర్, రెక్లూస్ స్పైడర్ వంటి కొన్ని జాతుల సాలీడులకు మాత్రమే మనుషులను గాయపరచగలిగేంత పెద్ద కోరలు ఉంటాయి. సాధారణ స్పైడర్ కాటు వేసిన చోట చర్మం ఎర్రగా మారడం, వాపు, దురద, నొప్పి వంటి లక్షణాలు కనిపిస్తాయి. కానీ విడో స్పైడర్ కాటు లక్షణాలు అయితే 1-3 రోజుల వరకు కనిపిస్తాయి. కాటు చుట్టూ నొప్పి, వాపు ఉంటుంది. ఇది పొట్ట, వెన్ను, ఛాతికి వ్యాపించవచ్చు. పొత్తి కడుపు బిగువుగా ఉండడం లేదా తీవ్రమైన కండరాల నొప్పులు ఉంటాయి. వాంతులు, వికారం, వణుకు, చెమటలు పట్టడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. అలాగే సాలీడు కాటుకు చికిత్స ఎలా చేయాలో ఇప్పుడు తెలుసుకుందాం.

### ప్రథమ చికిత్స ఇలా చేయాలి..

చాలా సందర్భాల్లో ఇంట్లోనే ఫస్ట్ ఎయిడ్‌తో చికిత్స చేయవచ్చు. సాలీడు కాటు వేసిన చోట గోరువెచ్చని నీటితో, సబ్బుతో కడగాలి. ఇన్ఫెక్షన్ బారిన పడకుండా యాంటీ బయోటిక్ క్రీమ్ రాయాలి. కాటుకు గురైన చోట ఐస్ ప్యాక్ పెట్టి వాపు తగ్గించాలి. దురద, వాపు తగ్గేందుకు యాంటీ హిస్టమిన్ మందులు తీసుకోవచ్చు. నొప్పి ఉంటే ఐబుప్రోఫెన్ లేదా పారాసిటమాల్ తీసుకోవచ్చు. అయితే కొన్ని సందర్భాల్లో స్పైడర్ కాటు తీవ్రమవుతుంది. కాటు వేసిన చోట సమస్యలు తలెత్తుతాయి. బ్రౌన్ రెక్లూస్ సాలీడు కాటు వల్ల కణజాల క్షయం చెందిన గాయాలు సాధారణంగా కనబడతాయి. చర్మ కణజాలం నశిస్తుంది. పుండ్లు, బొబ్బలు రావడం జరుగుతుంది. ఇవి నెమ్మదిగా మానిపోవడం, మచ్చలు పడటం కూడా జరుగుతుంది.

### ఈ లక్షణాలు కనిపిస్తే అలర్ట్ అవ్వాలి..

కాటు వేసిన చోట ఎరుపు చీము లేదా పసుపు రంగు స్రావం కనిపిస్తే ఇన్ఫెక్షన్ వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అత్యల్ప సందర్భాల్లో ప్రమాదకరమైన స్పైడర్ కాటు చిన్నారులకు ప్రాణాపాయం కలిగించవచ్చునని వైద్యులు చెబుతున్నారు. సాధారణంగా స్పైడర్ కాట్లు చిన్నవే అయినప్పటికీ, కొన్ని సందర్భాల్లో అవి తీవ్రమైన ఇన్ఫెక్షన్లకు దారి తీస్తాయి. కనుక కాటు వేసిన చోట వాపు పెరగడం, నొప్పి ఎక్కువవడం, రంగు మారడం వంటి లక్షణాలను గమనించిన వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.


# కిన్నెరసానిని ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం





- వన్యప్రాణులను తిలకించేందుకు ప్రత్యేక సఫారీ ట్రాక్‌ల ఏర్పాటు.
- పర్యాటకులను అకట్టుకోనున్న బటర్ ఫ్లై పార్క్.
- నియోజకవర్గంలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై ప్రేత్యేక ద్రుష్టి సారించాం
- త్వరలోనే హరిత హోటల్ ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తెస్తాం.
- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు.

భద్రాద్రి కొత్తగూడెం /పాల్వంచ / జూన్ 18 అక్షరం న్యూస్ -: కిన్నెరసాని పర్యాటక ప్రాంతాన్ని ప్రపంచస్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తానని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. పాల్వంచ పరిధిలోని కిన్నెరసాని ప్రాజెక్టులో అటవీశాఖ ద్వారా రూ.45 లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన మూడు ప్రత్యేక సఫారీ వాహనాలను, బటర్‌ఫ్లై




పార్కును, ఫీడ్ స్టోరేజ్ షెడ్‌ను, సీసీ రోడ్డును జిల్లా కలెక్టర్ అంకిత్‌తో కలిసి అయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రత్యేక సభలో అయన మాట్లాడారు. పర్యాటకులు అడవిలో దాదాపు 8 కిలోమీటర్ల మేర ప్రయాణించి జింకలు, వన్యప్రాణులు, పక్షులను నేరుగా చూసేలా ప్రత్యేక సఫారీ ట్రాక్‌లను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పర్యాటకులు ఈ సరికొత్త సఫారీ రైడ్, బటర్‌ఫ్లై పార్కులను సందర్శించి సరికొత్త అనుభూతిని పొందేవిధంగా అన్ని వసతులు అందుబాటులోకి తెచ్చామన్నారు. కిన్నెరసానిలోని బోటింగ్, జింకల పార్కును మరింతగా నవీకరిస్తామని చెప్పారు. క్రాస్ రోడ్డులోని హరిత హోటల్‌ను త్వరలోనే ప్రారంభించుకోబోతున్నామని, దీనికి మరిన్ని నిధులు మంజూరు చేయించి, తుదిమెరుగులు దిద్ది ప్రజలకు అందుబాటులోకి తెస్తామని తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని పర్యాటక ప్రాంతాలను మరింతగా అభివృద్ధి చేసేందుకు పక్కా ప్రణాళికలతో ముందుకు సాగుతామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, జిల్లా ఫారెస్ట్ అధికారి క్రిస్ట గౌడ్, కిన్నెరసాని సర్పంచ్ వజ్ర రామకృష్ణ, సీపీఐ నాయకులు వీసంశెట్టి పూర్ణచంద్రరావు ఉప్పుశెట్టి రాహుల్, డి సుధాకర్, అన్నారపు వెంకటేశ్వర్లు, శనగారపు శ్రీనివాసరావు, వైఎస్ గిరి, శ్రీను, ఖాసీం, బాబురావు, వెంకన్న చల్ల కృష్ణ, ఫారెస్ట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల సత్వర పరిస్కారంకోసమే 'ముఖాముఖి





- అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేదిలేదు.
- ప్రభుత్వ యంత్రాంగాన్ని ప్రజలకు చేరువచేసేందుకే "ముఖాముఖి' కార్యక్రమం.
- ప్రజా వినతులు, సమస్యల పరిష్కారానికి స్పెషల్ డ్రైవ్ చేపడతాం.
- అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందుతాయి.
- ప్రజలతో ఎమ్మెల్యే ముఖాముఖి కార్యక్రమానికి అపూర్వ స్పందన.
- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు.

భద్రాద్రి కొత్తగూడెం/ పాల్వంచ / జూన్ 18 / అక్షరం న్యూస్ -: ప్రజా సమస్యల సత్వర పరిస్కారంకోసమే 'ముఖాముఖి' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, సమస్యలను నేరుగా తెలుసుకోవడంతోపాటు అధికార యంత్రాంగాన్ని, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను ప్రజలకు చేరువ చేసేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. 'మనకోసం..మన ఎమ్మెల్యే' కార్యక్రమంలో భాగంగా గురువారం పాల్వంచ మ ం ం న్సి ప్ ల్ కార్యాలయం సమావేశ మందిరంలో 'ప్రజలతో ముఖాముఖీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రజలనుంచి అనూహ్య స్పందన లభించింది. వివిధ శాఖల అధికారులు, వివిధ ప్రాంతాలలోని లబ్ధిదారులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని తమ సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. అక్కడే ఉన్న అధికారులను వాటిని తక్షణమే పరిష్కరించాలని ఎమ్మెల్యే సూచించారు. పలురకాల వినతులు స్వీకరించి పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అధికారులను ప్రజలచెంతకు చేర్చెడుకే తాము "ముఖాముఖి' కార్యక్రమం చేపట్టామని తెలిపారు. దీని ద్వారా ప్రజాసమస్యలు నేరుగా తెలుసుకునే అవకాశం ఉంటుందని అన్నారు. ప్రజల నుంచి వచ్చిన వినతులపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి, వాటి పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని ఆదేశించారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేదిలేదని అధికారులను హెచ్చరించారు. మౌలిక వసతుల కల్పనతోనే బస్తీలు, గ్రామాలు సమగ్ర అభివృద్ధి చెందుతాయని, ఆ దిశగా నియోజకవర్గ వ్యాప్తంగా మౌలిక సదుపాయాల కొరత లేకుండా చూసేందుకు నిరంతరం పర్యవేక్షిస్తామని భరోసా ఇచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందుతాయని, ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలో నిజమైన లబ్ధిదారులకు చేరినప్పుడే ఆశించిన ఆశయాలు నెరవేరుతాయని వివరించారు. ప్రజా సమస్యల శాశ్వత పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజా దర్బార్ తరహాలో నిర్వహించే ఇలాంటి కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, డిప్యూటీ మేయర్ లలిత కుమారి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబా వీసంశెట్టి పూర్ణచంద్రరావు ఉప్పుశెట్టి రాహుల్, తహసిల్దార్ దారా ప్రసాద్, ఇంచార్జీ కమిషనర్ విజయానంద్ ఎలక్ట్రికల్ ఏ డి ఇ అబ్దుల్ రెహమాన్, టౌన్ ఎస్సై తోట నాగరాజు, అబ్కారీ సీఐ ప్రసాద్, ఎంపిడిఓ, ఫారెస్ట్ ఆఫీసర్, కార్పొరేటర్లు వీసంశెట్టి విశ్వేశ్వరరావు గుర్రం వెంకటేశ్వర్లు నామ కీర్తి గొర్లె అన్నపూర్ణ, చెరుకు భాగ్యలక్ష్మి, దున్నపోతుల మణి, వీ భవిత, దంతబోయిన నరేష్, నాయకులు వీ పద్మజ, డి సుధాకర్, అన్నారపు వెంకటేశ్వర్లు, నిమ్మల రాంబాబు, శెనగారపు శ్రీనివాసరావు, రెహమాన్, గిరి, గౌస్ పాషా, మస్తాన్, అహ్మద్ జానీ, కరీం, గొర్లె నరేష్, నామ పండు, ఆలపాటి ప్రసాద్, అల్లి వెంకటేశ్వర్లు వివిధ శాఖల డి ఈ లు ఏఈలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# వన మహోత్సవ కార్యక్రమాన్ని వర్చువల్ విధానంలో ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి





- **కిన్నెరసాని తెలంగాణకు ఊపిరితిత్తుల వంటిది ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు.**
- **జిల్లాలో 55 లక్షల మొక్కల నాటడమే లక్ష్యం -- జిల్లా కలెక్టర్ అంకిత్.**









భద్రాద్రి కొత్తగూడెం / పాల్వంచ / జూన్ 18 / అక్షరం న్యూస్ -:రాష్ట్ర అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వన మహోత్సవ కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గురువారం వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన హరిత కార్యక్రమాలతో పాటు కిన్నెరసాని వన్యప్రాణి నిర్వహణ కేంద్రంలో ఏర్పాటు చేసిన పలు అభివృద్ధి కార్యక్రమాలను కూడా వర్చువల్ విధానంలో ప్రారంభించారు.

ఈ కార్యక్రమం లో భాగంగా కిన్నెరసాని వన్యప్రాణి నిర్వహణ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, జిల్లా కలెక్టర్ అంకిత్‌తో కలిసి ముఖ్యమంత్రి ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. అనంతరం వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.అనంతరం .45 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన సఫారీ వాహనాలు, ట్రెక్కింగ్ సౌకర్యం, బటర్‌ఫ్లై పార్క్, జింకల పార్కులో ఫీడింగ్ షెడ్, సీసీ రోడ్డు తదితర అభివృద్ధి పనులను ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జిల్లా కలెక్టర్ అంకిత్ సంయుక్తంగా ప్రారంభించారు. లిఈ సందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూలి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్ని రంగాల్లో ముందంజలో ఉన్న జిల్లాగా గుర్తింపు పొందిందన్నారు. రాష్ట్రంలోనే అత్యధిక అటవీ విస్తీర్ణం కలిగిన జిల్లా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అని పేర్కొన్నారు. కిన్నెరసాని తెలంగాణకు ఊపిరితిత్తుల వంటిదని అన్నారు. అటవీ హక్కుల చట్టం ద్వారా గిరిజనులకు పోడు భూములపై హక్కులు కల్పించడంతో పాటు కొత్తగా అటవీ భూముల ఆక్రమణలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కిన్నెరసానిని మరింత అభివృద్ధి చేసి రాష్ట్రంలోని ప్రధాన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. కిన్నెరసానిలో తీగల వంతెన నిర్మాణం కోసం ప్రత్యేకంగా కృషి చేస్తున్నామని, అద్దాల మేడ, జూ పార్కు, బోటు షికారు, పర్యాటక హోటల్ అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. మణుగూరులోని వేడి నీటి గుంతల ప్రాంతం వరకు కిన్నెరసాని సఫారీ కారిడార్ ఏర్పాటు చేయడం ద్వారా పర్యాటక రంగానికి మరింత ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. అదేవిధంగా అతి త్వరలో కొత్తగూడెం పట్టణానికి రూ.500 కోట్ల వ్యయంతో రింగ్ రోడ్డు, అతి పెద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జి మంజూరుకు చర్యలు జరుగుతున్నాయని వెల్లడించారు. అటవీ సంపద పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, జిల్లాలో హరితాభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు.

లిజిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూలి జిల్లాలో సుమారు 50 శాతం భూభాగం అటవీ ప్రాంతంగా ఉందని, జిల్లా ప్రజల జీవన విధానం అడవులతో ముడిపడి ఉందన్నారు. వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 55 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యంగా కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు 42 శాఖలకు మొక్కల నాటే బాధ్యతలను కేటాయించామని చెప్పారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యతను కూడా ప్రతి ఒక్కరూ తీసుకోవాలని సూచించారు. గత 24 సంవత్సరాలతో పోలిస్తే ఈ సంవత్సరం రాత్రి ఉష్ణోగ్రతలు 35 డిగ్రీల సెల్సియస్‌కు పైగా నమోదవడం ఆందోళనకర విషయమని, పర్యావరణ సమతుల్యత కోసం విస్తృత స్థాయిలో మొక్కలు నాటాల్సిన అవసరం ఉందన్నారు. ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, వార్డు సభ్యులు, వివిధ శాఖల అధికారులు మొక్కల సంరక్షణపై ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. నాటిన మొక్కల్లో కనీసం 95 శాతం మొక్కలు వృక్షాలుగా ఎదిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని శాఖల సమన్వయంతో వన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

లిజిల్లా అటవీ శాఖ అధికారి కృష్ణ గౌడ్ మాట్లాడుతూలి రాష్ట్రంలోనే అత్యధిక అటవీ విస్తీర్ణం కలిగిన జిల్లా భద్రాద్రి కొత్తగూడెం అని తెలిపారు. జిల్లాలో సుమారు ఎనిమిది లక్షల ఎకరాల అటవీ భూమి ఉన్నదని పేర్కొన్నారు. గతంలో కొంత మేర అటవీ భూమిని కోల్పోయినప్పటికీ ప్రస్తుతం అటవీ సంపద పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. అభివృద్ధి, అటవీ సంరక్షణ, గిరిజనుల సంక్షేమం సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. పర్యాటక రంగ అభివృద్ధిలో భాగంగా కిన్నెరసానిలో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని తెలిపారు. అనంతరం సఫారీ వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, సర్పంచ్ వజ్జా రామకృష్ణ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, ఎఫ్డిఓ లు బాబు, చారి, తాసిల్దార్ ధారా ప్రసాద్,అటవీ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది, ప్రకృతి ప్రేమికులు తదితరులు పాల్గొన్నారు.









# వెన్నుపోటు రాజకీయాలు జగన్‌కు వెన్నతో పెట్టిన విద్య

- కులలాల మధ్య తగవులు పెఓట్టడం ఆయనకే చెల్లింది
- హోంమంత్రి అనితపై గుడివాడ వ్యాఖ్యలు దారుణం
- మాజీమంత్రి సోమిరెడ్డి ఘాటు విమర్శలు

నెల్లూరు,జూన్18 వెన్నుపోటు పేరుతో ర్యాలీలు నిర్వహిస్తున్న జగన్ ముందుగా తన రాజకీయ చరిత్రను చూసుకోవాలని మాజీమంత్రి, టిడిపి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. మద్యనిషేధం సహా అన్ని హామీలు విస్మరించిన జగన్‌కు, కూటమి మేనిఫెస్టో గురించి మాట్లాడే నైతిక అర్హత లేదన్నారు. మతాల మధ్య చిచ్చుపెట్టే కుట్రలు పారనివ్వకపోవడంతో కులాల మధ్య తగవులు పెట్టేందుకు సిద్ధమయ్యాడని ఆరోపించారు.జగన్‌కు దమ్మూధైర్యం ఉంటే డీఎస్సీలో అక్రమాలపై ఆధారాలతో చర్చకు రావాలని లోకేశ్ చేసిన సవాల్ స్వీకరించాలన్నారు. రొయ్యల ఫీడ్ కంపెనీలకు జగన్ కులం ఆపాదించడం సిగ్గుచేటన్నారు. అనితను రాజకీయంగా ఎదుర్కోలేక వైసీపీ నీచ రాజకీయాలకు పాల్పడుతోందన్నారు. తమ ఇంట్లోనూ మహిళలు ఉన్నారనే విజ్ఞత మరిచి గొడ్డలి పార్టీ నేతలు మాట్లాడుతున్నారని అన్నారు. అమర్నాథ్ వ్యాఖ్యలపై జగన్ రాష్ట్ర మహిళలకు, హోంమంత్రికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.ఆస్తి కోసం తల్లి, చెల్లిని కూడా వెన్నుపోటు పొడిచిన ఘనుడు జగన్ అని విమర్శించారు. రాష్ట్రంలో సామాజిక సామరస్యాన్ని దెబ్బతీయడానికి కుట్రలు చేస్తున్నారని, ఏదైనా సంఘటన జరిగితే.. దానికి కులం రంగు పులిమి ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కులాల మధ్య చిచ్చు పెట్టడమనేది జగన్ డీఎన్‌ఏలోనే ఉందని విమర్శించారు. కుల చిచ్చులో భాగంగానే గుడివాడ అమర్నాథ్ హోం మంత్రి అనితపై దిగజారుడు వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. అనితకు గుడివాడ అమర్నాథ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దళిత మహిళ అనిత హోంమంత్రిగా ఎదగడాన్ని సహించడం లేదన్నారు. మహిళల పట్ల జగన్‌కు, గొడ్డలి పార్టీ నేతలకు ఉన్న గౌరవం ఏపాటిదో రాష్ట్ర ప్రజలందరికీ తెలిసిందని పేర్కొన్నారు. హోం మంత్రి అనితను రాజకీయంగా ఎదుర్కోలేక వ్యక్తిత్వ హననానికి పాల్పడటం దారుణమన్నారు. మహిళా నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేసే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. రాజకీయ విమర్శలు విధానాలపై ఉండాలి కానీ వ్యక్తిత్వ హననానికి దిగడం వైసీపీ సంస్కృతికి నిదర్శమని అన్నారు. ప్రజాసమస్యలపై మాట్లాడలేని వారు వ్యక్తిగత దూషణలతో రాజకీయ లబ్ది పొందాలని చూస్తున్నారని విమర్శించారు.

# తమిళనాట అనూహ్య రాజకీయ పరిణామాలు

- సిఎం విజయ్‌తో వైకో భేటీతో ఊహాగానాలు
- డిఎంకెను వీడుతారన్న ప్రచారం



చెన్నై,జూన్18 తమిళనాడు రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. తన స్థానాన్ని పదిలం చేసుకునే దిశగా సిఎం విజయ్ అడుగులు వేస్తున్నారు. ద్రవిడ పార్టీలు కలిసినా తన మనుగడకు ఢోకా లేకుండా చేసుకుంటున్నారు. అందుకే అన్నా డిఎంకె ఎమ్మెల్యేలు ఒక్కరొక్కరుగా రాజీనామా చేసి, టివికెలో చేరుతున్నారు. వీరంతా మళ్లీ ఉప ఎన్నికల్లో అధికార పార్టీ నుంచి పోటీచేసే అవకాశం ఉంది. దీంతో అన్నా డిఎంకె కూడా పూర్తిగా బలహీనపడే పరిస్థితి కనిపిస్తోంది. మరోవైపు వైకో సిఎంతో భేటీ కావడం మరో కొత్త అంశం తెరపైకి వచ్చింది. డీఎంకేకు చిరకాల మిత్రపక్షమైన మరుమలార్చి ద్రవిడ మున్నేట్ర కళగం(ఎండీఎంకే) అధికార తమిళగ వెట్రి కళగం(టీవీకే)తో జట్టుకట్టనుందా? అనే చర్చ ఆ రాష్ట్ర రాజకీయాల్లో జోరందుకుంది. ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైకో.. సీఎం జోసెఫ్ విజయ్‌తో భేటీ కావడం ఈ ఊహాగానాలకు బలం చేకూరుస్తోంది. కాగా.. ఇటీవలే వైకో కుమారుడు, ఎండీఎంకే ఎంపీ దురై వైకో కూడా విజయ్‌తో సమావేశమైన సంగతి తెలిసిందే. కాగా.. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే నేతృత్వంలోని కూటమిలో ఎండీఎంకే పోటీచేసి రెండు స్థానాలను కైవసం చేసుకుంది. ఆ పార్టీ సాధారణ మండలి సమావేశం ఈ నెలాఖరులో జరగనుంది. పార్టీ భవిష్యత్తు రాజకీయ దిశగా ఆ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకునే అవకాశమున్నట్టు తెలుస్తోంది. అయితే.. టీవీకే నేతృత్వంలోని మైనారిటీ ప్రభుత్వంపై జరిగిన విశ్వాస పరీక్షలో ఎండీఎంకే తటస్థంగా వ్యవహరించింది. డీఎంకేతో కలిసి పనిచేసిన పలువురు మాజీ మిత్రపక్షాలు ఇప్పటికే టీవీకే ప్రభుత్వానికి మద్దతిస్తున్నాయి. కాంగ్రెస్, వీసీకే, ఐయూఎంఎల్ పార్టీలు అధికార వ్యవస్థలో భాగస్వాములయ్యాయి. మరోవైపు సీపీఐ, సీపీఎం పార్టీలు విజయ్ నేతృత్వంలోని ప్రభుత్వానికి బయట నుంచే మద్దతు తెలుపుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎండీఎంకే వైఖరి మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. యితే.. ఈ ఊహాగానాలపై వైకో అప్రమత్తంగా వ్యవహస్తున్నట్టు తెలుస్తోంది. పార్టీ భవిష్యత్తు రాజకీయ నిర్ణయాలను సాధారణ మండలి ఆధ్వర్యంలోనే తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. సీఎం విజయ్‌తో సమావేశం పూర్తిగా ప్రజా సమస్యలపైనే జరిగిందని పేర్కొన్నారు. తూత్తుకుడిలో వేదాంత గ్రూప్‌నకు అనుబంధంగా మరో రాగి పరిశ్రమ ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయనే అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. అలాంటి ప్రాజెక్టుకు అనుమతి ఇవ్వొద్దని కోరానని వెల్లడించారు.

# భార్య మోసం నిరూపించిన భర్తకు న్యాయం

రూ.15 లక్షల పరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశం

భార్యతో పాటు కుటుంబ సభ్యులు, ప్రియుడు బాధ్యులని తీర్పు

కేరళ ఫ్యామిలీ కోర్టు కీలక నిర్ణయం

పతనంతిట్ట, జూన్ 18 వైవాహిక వివాదాలకు సంబంధించిన కేసుల్లో సాధారణంగా మహిళలకు అనుకూలంగా తీర్పులు వస్తాయనే అభిప్రాయం ఉన్నప్పటికీ, కేరళలోని పతనంతిట్ట ఫ్యామిలీ కోర్టు తాజాగా ఒక భర్తకు అనుకూలంగా కీలక తీర్పును వెలువరించింది. భార్య చేసిన మోసం, ఆమె ప్రవర్తన వల్ల తాను ఎదుర్కొన్న మానసిక వేదనను భర్త ఆధారాలతో సహా నిరూపించడంతో కోర్టు అతనికి న్యాయం చేసింది. కోర్టు విచారణలో వెల్లడైన వివరాల ప్రకారం, ఈ వివాహం భార్యాభర్తలిద్దరికీ రెండో పెళ్లి. అయితే పెళ్లి తర్వాత కూడా భార్య మరో వ్యక్తితో వివాహేతర సంబంధాన్ని కొనసాగించినట్లు భర్త ఆరోపించాడు. అంతేకాకుండా పెళ్లికి ముందు ఒకసారి, పెళ్లి తర్వాత మరోసారి తనకు తెలియకుండా గర్భస్రావం చేయించుకుందని కూడా కోర్టుకు తెలిపాడు.భార్య ప్రవర్తన కారణంగా తన వైవాహిక జీవితం దెబ్బతిందని, కుటుంబ పరువు ప్రతిష్ఠలకు నష్టం కలిగిందని, తీవ్ర మానసిక క్షోభను అనుభవించాల్సి వచ్చిందని భర్త 2018 జులైలో కోర్టును ఆశ్రయించాడు. ఈ కేసుపై సుదీర్ఘకాలం విచారణ జరిపిన కోర్టు ఇరుపక్షాల వాదనలు, సమర్పించిన ఆధారాలను పరిశీలించింది. విచారణ అనంతరం ఈ వివాహ బంధం విచ్ఛిన్నం కావడానికి భార్య ఒక్కరే కాకుండా, ఆమెకు సహకరించిన కుటుంబ సభ్యులు మరియు ఆమెతో సంబంధం ఉన్న వ్యక్తి కూడా బాధ్యులేనని కోర్టు అభిప్రాయపడింది.


# విద్యారంగంలో మార్పులు కావాలి !



హైదరాబాద్,జూన్18 తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రారంభం ఒక గొప్ప ముందడుగనే చెప్పాలి. అందరికీ విద్య అన్నది ప్రభుత్వ పరంగా చేపట్టడం ఆహ్వానించదగ్గ విషయం. విద్య,వైద్యం విషయంలో కఠిన నిర్ణయాలు తీసుకుంటే ఓ ఐదేళ్లలో గణనీయమైన మార్పులు తీసుకుని రావచ్చు. గ్రామస్థాయి వరకు ప్రాథమిక విద్య, ప్రాథమిక వైద్యం అందితే ప్రజలకు అంతకు మించి కావాల్సింది లేదు. కులాలు, మతాల వారీగా హాస్టళ్లు, స్కూళ్ల వల్ల సమాజంలో అసమనాతలు పెరిగాయి. ఇదే విషయాన్ని పదేపదే ప్రస్తావిస్తున్న సిఎం రేవంత్ ఓ మంచి అడుగు వేశారనే చెప్పాలి. అయితే ఇదొక్కటే సరిపోదు. రేవంత్ రెడ్డి పదవీ కాలంలో రెండున్నరేళ్లు పూర్తయ్యాయి. ఇంకా రెండేళ్ల పదవీకాలం మాత్రమే ఉంది. కనీసం ఉన్న స్కూళ్లనయినా బాగుచేసి, హాస్టళ్లను స్కూళ్లకు అనుసంధానం చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టాలి. కెసిఆర్ హయాంలో కెజి టూ పిజి అని ప్రగల్భాలు పలికారు. కానీ దానిని ఏనాడు పట్టాలకు ఎక్కించలేక పోయారు. ఆనాడే చేసివుంటే పదేళ్లలతో తెలంగాణ విద్యావ్యవస్థ రూపురేఖలు మారి ఉండేవి. ఇప్పటికైనా కామన్ విద్యావిధానం తీసుకుని రావాలి. అందరికీ ఒకేచోట విద్యను తీసుకుని వస్తే ప్రైవేట్ స్కూళ్ల దోపిడీ కూడా తగ్గుంది. గ్రామాల్లో కూడా సామాన్య జనం నేటికీ అప్పులు చేసి పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపుతున్నారు. దీనిని తక్షణం నిరోధించాలి. ఈ దోపిడీని అరికట్టాలి. స్కూళ్లను అభివృద్ధి చేయడం వల్ల సమాజాంలో కులాల మధ్య అంతరాన్ని తొలగించడంతో పాటు, కుటుంబాల ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దవచ్చు. ప్రైవేట్ దోపిడీని అరికట్టవచ్చు. అలాగే ఏకీకృత విద్యకు కృషి చేయాలి. విద్యా వివక్షను రూపుమాపాలంటే కామన్ స్కూల్ విధానం వెంటనే అమలు చేయాల్సి ఉంది. తెలంగాణ పబ్లిక్ స్కూల్ కాన్సెప్ట్‌ను సిఎం తప్పనిసరిగా అమలు చేయగలిగితే అతిపెద్ద విజయం సాధించినట్లుగా చెప్పవచ్చు. అలా కాకుండా తెలంగాణ పబ్లిక్ స్కూల్, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల పేరుతో ప్రభుత్వం ఎన్ని సంస్కరణలు ప్రవేశపెట్టినా లాభం ఉండదు. ఎంతగా డబ్బులు ఖర్చు చేసినా అత్యధిక విద్యార్థులున్న ప్రైవేటు విద్యా సంస్థలను నియంత్రించకుండా, ప్రభుత్వ బడులను సంస్కరించకుండా ముందుకు సాగితే సత్ఫలితాలు సాధించలేం. ప్రభుత్వ బడికి గతంలో ఉన్న ఇమేజ్ తీసుకుని రావాలంటే ప్రైవేటుకు దీటుగా ఉన్నాయన్న భరోసా కల్పించాలి. అందుకు గట్టి కృషి చేయాలి. నాణ్యమైన ఉచిత విద్య ప్రభుత్వ బడిలో దొరుకుతుందనే గట్టి నమ్మకం మాత్రమే ప్రభుత్వ విద్యా సంస్థలలో నమోదు పెంచుతుంది. కాబట్టి పాలకులకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే గ్రామాల వారీగా ఏకీకృత కామన్ పాఠశాల వ్యవస్థకు రూపకల్పన చేయాలి. అంతేగాక ఇబ్బడి ముబ్బడిగా కనీస వసతులు లేకుండా నడుస్తున్న ప్రైవేటు విద్యా సంస్థలను నిషేధించాలి. లేదా నియంత్రణ చర్యలు చేపట్టాలి. ఇలా చేయగలిగితే సిఎం రేవంత్ ర ఎడ్డి ఆశించిన ఫలితాలు వస్తాయి. అంతరాలు లేని శాస్త్రీయ విద్య అందరికీ అందుబాటులోకి వస్తుంది. కామన్ స్కూల్ విధానం మాత్రమే ప్రజలకు ఏకైక విద్యా ప్రత్యామ్నాయంగా గుర్తించి ముందుకు సాగేందుకు తెలంగాణ పబ్లిక్ స్కూల్ విధానం దోహదపడుతుంది. గ్రామాల్లో నర్సరీ నుంచి ఇంటర్ వరకు తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో ఒకే స్కూల్ ప్రజలకు అందుబాటులోకి తీసుకుని రావాలి. తెలుగు మీడియం అయినా ఆంగ్లబోధనను కూడా తప్పనిసరి చేయాలి. స్పోకెన్ ఇంగ్లీష్‌తో దీన్ని అధిగమించవచ్చు. ఇప్పుడు విద్యారంగానికి ఖర్చు చేస్తున్న నిధులతోనే ఏకీకృత విద్యను అందుబాటులోకి తీసుకుని రావచ్చు. గ్రామస్థాయి నుంచి పట్టణస్థాయి వరకు అందరి పిల్లలు ఒకే పాఠశాలలో చదువుకునే ఏకీకృత విధానం అమలు కావాలి. అక్కడే విద్యార్థులు బ్రేక్ ఫాస్ట్ మొదలు, మధ్యాహ్న భోజనం అందించాలి. ఇంటి నుంచి పిల్లలు స్కూలుకు వచ్చేలా అవసరమైతే ట్రాన్స్‌పోర్టు కూడా ఏర్పాటు చేయాలి. ఇది కుల, మత వైషమ్యాలు లేని విద్యా వ్యవస్థకు పునాది వేయగలదు. ఒక మండల కేంద్రంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ లాంటి స్కూల్ ఉంటే ఆ చుట్టుపక్కల విద్యార్థులంతా స్కూల్ బస్సుల్లో వచ్చి పోయేలా సౌకర్యాలు కల్పించాలి. దీనివల్ల పిల్లలు తల్లిదండ్రుల సమక్షంలోనే పెరగగలరు. హాస్టళ్లలో పడి బాల్యం కోల్పోకుండా చూడగలం. తల్లిదండ్రుల అజమాయిషీలో వారికి ఖర్చు లేకుండా అంతా ప్రభుత్వ కనుసన్నల్లో విద్యను నేర్చుకోగలరు. ఇలా కిలోమీటరు నుంచి ఐదు కిలోమీటలర్ పరిధి వరకు పిల్లలకు స్కూలును అందుబాటులోకి తీసుకుని రావడం ద్వారా సంక్షేమ హాస్టళ్ల బాధ తప్పుతుంది. ఇకపోతే ప్రత్యేక అవసరాలు గల మూగ, బధిర, అంధ బాలలకు మాత్రం ప్రత్యేకంగా పాఠశాలలను ఏర్పాటు చేసి, దానికి అనుబంధంగా మాత్రం హాస్టళ్లను కొనసాగించాలి. మానసిక ఎదుగుదల లేని పిల్లలు ప్రత్యేక అవసరాలు గల పిల్లలుగా గుర్తించినా, వారిని తల్లిదండ్రుల ప్రత్యేక పర్యవేక్షణ కిందనే ఉంచి, పాఠశాలల వసతులను కల్పించాలి. అభివృద్ధి చెందిన అమెరికా, బ్రిటన్ లాంటి దేశాల్లో సైతం ఏకీకృత పాఠశాల వ్యవస్థ ప్రభుత్వ రంగంలోనే విస్తృతంగా అభివృద్ధి చెందింది. మన దేశంలో నియంత్రణ, నియమాలు లేకుండా విచ్చలవిడిగా ప్రైవేటు పాఠశాల వ్యవస్థను అనుమతించడం వల్ల విద్యావ్యవస్థ వెర్రితలలు వేసింది. అవసరాలకు మించి ప్రైవేటు పాఠశాలల ఏర్పాటుతో ప్రభుత్వ పాఠశాల వ్యవస్థ దెబ్బ తింటోంది. తెలంగాణలో ఇప్పటికే నాలుగు వేల పాఠశాలలు మూతపడ్డాయని అంటున్నారు. 19లక్షల విద్యార్థులు ప్రభుత్వ విద్యాలయాల్లో చదువుతుంటే, 36లక్షల మంది విద్యార్థులు ప్రైవేటు విద్యా సంస్థలలో చదువుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. మనకు ఇంగ్లీష్ లేనిదే ముద్ద దిగదు. సామాన్యులు కూడా తమ పిల్లలు ఇంగ్లీషులో మాట్లాడాలని అనుకుంటారు. అందుకు ప్రభుత్వ స్కూళ్లలో స్పోకెన్ ఇంగ్లీష్ తప్పనిసరి చేయాలి. ఎల్‌కెజి నుంచే అది మొదలు కావాలి. మీడియం తెలుగు అయినా స్పోకెన్ ఇంగ్లీష్ ఉంటే పిల్లలు కూడా పెద్దయ్యాక బెరకు లేకుండా దూసుకు పోగలరు. ఇవన్నీ గమనించి విద్యారంగాన్ని పటిష్టం చేసే చర్యలకు అడుగులు వేస్తే విద్యారంగంలో విప్లవం సాధించగలం.

# టిఎంసికి హైకోర్టులో ఎదురుదెబ్బ

- రితబ్రత బెనర్జీ నియామకంపై సవాల్
- మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమన్న హైకోర్టు



కోల్‌కతా,జూన్18 తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) అధినేత్రి మమతా బెనర్జీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడిగా తిరుగుబాటుచేసిన ఎమ్మెల్యే రితబ్రత బెనర్జీ నియామకాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై కోల్‌కతా హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులిచ్చేందుకు నిరాకరించింది. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ కృష్ణారావు నేతృత్వంలోని ధర్మాసనం.. తదుపరి విచారణ జరిపేంత వరకు స్పీకర్ నిర్ణయం అమలులో ఉంటుందని స్పష్టం చేసింది. ఈ పిటిషన్ తదుపరి విచారణకు ముందే అఫిడవిట్ల మార్పిడిని పూర్తి చేయాలని ఇరు పక్షాలను ఆదేశించింది న్యాయస్థానం. ప్రతివాదులు మూడు వారాల్లోగా తమ వ్యతిరేక అఫిడవిట్‌ను దాఖలు చేయాలని, దానిపై మరో పక్షం వారు రెండు వారాల్లోగా స్పందించాలని గడువు విధించింది. ఈ విషయంపై తదుపరి విచారణ జులై 28కి వాయిదా వేసింది. దీంతో ఈ కేసు ఫలితం వెలువడే వరకు రితబ్రత బెనర్జీ గుర్తింపు పొందిన ప్రతిపక్ష నేతగా కొనసాగనున్నారు. కాగా.. టీఎంసీ నుంచి బహిష్కృతమైన రితబ్రత బెనర్జీ.. ఆ పార్టీకి వ్యతిరేకంగా తిరుగుబాటు ఎమ్మెల్యేలకు న్యాయకత్వం వహిస్తున్నారు. దీంతో బెంగాల్ రాజకీయ సంక్షోభంలో వివాదం రాజుకుంది. తమకు 58 మంది టీఎంసీ ఎమ్మెల్యేల మద్దతుందని పేర్కొంటూ, ఆమె మేనల్లుడైన అభిషేక్ బెనర్జీకి వ్యతిరేకంగా ఓ చీలిక వర్గాన్ని ఏర్పాటు చేశారు రితబ్రత. అయితే.. తిరుగుబాటు వర్గం వాదనను అంగీకరిస్తూ రితబ్రతను ప్రతిపక్ష నాయకుడిగా ఆ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ రతీంద్ర బోస్ నియమించడంతో ఈ వివాదం మరింత ముదిరింది. స్పీకర్ నిర్ణయం అధికారికంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీని పక్కనపెట్టిందని, శాసనసభ పార్టీల గుర్తింపును నియంత్రించే రాజ్యాంగ నిబంధనల్ని ఉల్లంఘించిందని వాదిస్తూ.. దీదీ వర్గం కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే.

## చేనేత ఉత్పత్తులను కేంద్రీకృత టెండర్ విధానం నుంచి మినహాయించాలి

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి కొండా సురేఖ వినతిపత్రం
- చేనేత కార్మికుల ఉపాధి పరిరక్షణకు చర్యలు కోరుతూ విజ్ఞప్తి
- వేలాది కుటుంబాల జీవనోపాధికి భరోసా కల్పించాలని అభ్యర్థన

హైదరాబాద్, జూన్ 18 చేనేత ఉత్పత్తులను కేంద్రీకృత టెండర్ విధానం నుంచి మినహాయించి చేనేత కార్మికుల ఉపాధిని పరిరక్షించాలని రాష్ట్ర మంత్రి కొండా సురేఖ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. చేనేత కార్మికుల సమస్యలు, వారి జీవనోపాధి అంశాలను ప్రస్తావిస్తూ ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేశారు. వరంగల్ జిల్లా చేనేత సహకార సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా 50కు పైగా చేనేత సహకార సంఘాలకు చెందిన సుమారు 5 వేల మంది చేనేత కార్మికులు పనిచేస్తున్నారని ఆమె తెలిపారు. గత మూడు దశాబ్దాలుగా రాష్ట్ర వస్త్రోత్పత్తి రంగానికి వారు వెన్నెముకగా నిలుస్తూ వేలాది కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్నారని పేర్కొన్నారు.

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ హాస్టళ్లు, గురుకుల విద్యాసంస్థలు, ఇతర ప్రభుత్వ విద్యాసంస్థలకు అవసరమైన బెడ్‌షీట్లు, కార్పెట్లు, యూనిఫాంలు తదితర వస్త్ర ఉత్పత్తులను చేనేత సంఘాలు నిరంతరం సరఫరా చేస్తున్నాయని వివరించారు. ఈ రంగంపై ఆధారపడి వేలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని తెలిపారు. కేంద్రీకృత టెండర్ విధానం అమలుతో చేనేత సహకార సంఘాలు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విధానం కారణంగా చిన్న స్థాయి చేనేత సంఘాలు పోటీలో నిలవలేక ఉపాధి అవకాశాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల చేనేత ఉత్పత్తులకు ప్రత్యేక మినహాయింపు ఇవ్వాలని కోరారు. చేనేత కార్మికుల సంక్షేమం, ఉపాధి భద్రత, సంప్రదాయ చేనేత రంగ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని వారి న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. చేనేత రంగాన్ని బలోపేతం చేయడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కూడా ఊతం లభిస్తుందని పేర్కొన్నారు.చేనేత ఉత్పత్తులను కేంద్రీకృత టెండర్ విధానం నుంచి మినహాయించడం ద్వారా వేలాది మంది కార్మికుల జీవనోపాధిని కాపాడవచ్చని మంత్రి కొండా సురేఖ తెలిపారు.

# ఐపీఎల్ 2027 సీజన్‌ను ముందుకు జరిపే ఛాన్స్

- మార్చి 10 నుంచి మే 15 వరకు ముగింపు
- అవకాశాలు పరిశీలిస్తున్న బిసిసిఐ



ముంబై,జూన్ 18 వచ్చే ఐపీఎల్ సీజన్‌కు సంబంధించి కీలక విషయాలను బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా వెల్లడించారు. ఐపీఎల్ 2027 సీజన్‌ను మార్చి 10 నుంచి మే 15 వరకు నిర్వహించేందుకు ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా మ్యాచుల సంఖ్య పెంపు విషయంలో ప్రస్తుతం ఎలాంటి చర్చ జరగలేదని పేర్కొన్నారు. తాజా ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. ఎండల తీవ్రత వల్ల ఐపీఎల్ 20వ సీజన్‌ను ఇంకాస్త ముందుగా నిర్వహించాలని భావిస్తున్నట్లు తెలిపారు. 'ఈ సంవత్సరం ఐపీఎల్ సీజన్ మార్చి 28 నుంచి మొదలై మే 31న ముగిసింది. మే 15 తర్వాత టోర్నీ కీలక దశకు చేరుకుంది. ఇలాంటప్పుడు పలుచోట్ల వర్షాలు పడే అవకాశమూ ఉంది. ఇక ఎండల తీవ్రత కూడా కొన్ని ప్రాంతాల్లో ఆందోళన కలిగించే అంశమే. ఇటు ప్లేయర్లతోపాటు అటు ప్రేక్షకులూ ఆటను ఆస్వాదించేందుకు ఇబ్బంది అవుతుంది. ఈక్రమంలో ఐపీఎల్ గవర్నింగ్ బాడీతో బీసీసీఐ చర్చలు జరుపుతోంది. లీగ్‌ను ఇంకాస్త ముందుగానే ప్రారంభిస్తే ఎలా ఉంటుందనే ఆలోచన చేస్తున్నాం. వచ్చే సీజన్ కోసం మార్చి 10 నుంచి మే 15 వరకు విండోను ఉంచాం. ప్లేఆఫ్స్, ఫైనల్‌కు వాతావరణం వల్ల ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలనేదే మా ఉద్దేశం. ఎండల తీవ్రత గురించి మాకు అభిమానుల నుంచి చాలా ఫిర్యాదులు వచ్చాయి. ఇటు ఆటగాళ్లూ ఇబ్బందులు పడ్డారు. కాబట్టి వారందరికీ మంచి వాతావరణం అందించాల్సిన బాధ్యత మాపై ఉందని సైకియా తెలిపారు. ఇకపోతే ఇప్పటికిప్పుడు మ్యాచుల సంఖ్య పెంపు విషయంలో నిర్ణయం తీసుకోలేం. చాలా అంశాలను పరిశీలించాల్సి ఉంటుంది. వివిధ దేశాల నుంచి ఆటగాళ్లు వస్తారు. దీనికోసం దాదాపు రెండు నెలల పాటు షెడ్యూల్‌ను కేటాయించాల్సి ఉంటుంది. కొందరు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండటం కష్టమవుతోంది. ఇతర దేశాలకూ ద్వైపాక్షిక సిరీస్‌లూ ఉంటాయి. ఇప్పటికైతే మ్యాచుల సంఖ్యను 74 నుంచి 94కు పెంచడంపై చర్చ జరగలేదు. భవిష్యత్తులో ఏం జరుగుతుందో ఇప్పుడే చెప్పలేమని దేవజిత్ సైకియా వెల్లడించారు.

## వన్డే ప్రపంచ కప్‌లో ఇషాన్‌కు చోటు ఖాయం

**సునీల్ గవాస్కర్ ఆశాభావం**


ముంబై,జూన్ 18 (ఆర్ఎన్ఎ): సౌతాఫ్రికా వేదికగా జరిగే 2027 వన్డే ప్రపంచ కప్ జట్టులో ఇషాన్ కిషన్ కచ్చితంగా చోటు దక్కించుకుంటాడని భారత మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ అభిప్రాయపడ్డారు. ఇషాన్‌ను ఇప్పుడు జట్టు నుంచి తప్పించడం దాదాపు అసాధ్యమని పేర్కొన్నారు. ప్రపంచ కప్‌నకు ఎంపిక కావడానికి ఇప్పటికే సరిపడా ప్రదర్శనను అతను చేశాడని చెప్పారు. 'ఇషాన్ కిషన్‌కు ఇప్పటికే దక్షిణాఫ్రికా వీసా వచ్చి ఉంటుందని నాకనిపిస్తోంది. అతడిని జట్టు నుంచి తప్పించాలంటే మరో ఆటగాడు అద్భుతమైన ప్రదర్శన చేయాల్సిందే. టీ20 ఫార్మాట్‌లో అతడు జట్టుకు ఎంతో కీలకమైన ఆటగాడు. పైగా చాలా బాగా బ్యాటింగ్ చేస్తున్నాడు. షాట్లు అద్భుతంగా ఆడుతున్నాడు. డిఫెన్స్ కూడా బాగుంది. బంతి షార్ట్‌గా వస్తే.. వెంటనే వెనక్కి జరిగి సిక్సర్లు కొడతాడు. గత ఏడాదిన్నర కాలంలో ఇషాన్ సంపూర్ణ ఆటగాడిగా మారాడు' అని గవాస్కర్ ప్రశంసలు కురిపించారు. ఇంగ్లాండ్ మాజీ స్పిన్నర్ గ్రేమ్ స్వాన్ కూడా ఇషాన్ బ్యాటింగ్‌కు ఫిదా అయ్యాడు. అతడు నిజమైన టీమ్ మ్యాన్. మూడో స్థానంలో బ్యాటింగ్ చేయమని అడిగితే మొదటి మ్యాచ్‌లోలాగే విలువైన ఇన్నింగ్స్ ఆడతాడు. రెండో వన్డేలో నాలుగో స్థానంలో బ్యాటింగ్ చేస్తూ అద్భుతమైన దూకుడు ప్రదర్శించాడు. భారత జట్టు జెర్సీ ధరించి ఆడుతున్నంత కాలం ఏ స్థానంలో బ్యాటింగ్ చేస్తున్నాడనే దానితో సంబంధం ఉండదు. అది చాలా మంచి విషయం. ఎక్స్‌ట్రా కవర్ మీదుగా అతను కొట్టిన షాట్లు నాకు ఎంతగానో నచ్చాయని గ్రేమ్ స్వాన్ పేర్కొన్నాడు. అఎ÷-గానిస్థాన్‌తో జరిగిన రెండో వన్డేలో ఇషాన్ 79 బంతుల్లో 125 పరుగులు చేశాడు. అర్ధ శతకానికి 52 బంతులు తీసుకున్న అతను.. తర్వాత రెచ్చిపోయాడు. మరో 19 బంతులకే సెంచరీ మార్కును అందుకున్నాడు.




## కోలీవుడ్‌లో దీపావళి ఫైట్

**రజనీకాంత్ జైలర్-2తో ధనుష్ మూవీ పోటీ**

కోలీవుడ్‌లో ఈ ఏడాది దీపావళి పండుగకు బాక్సాఫీస్ దగ్గర మరోసారి భారీ వార్‌కు రంగం సిద్ధమవుతోంది. సూపర్ స్టార్ రజనీకాంత్ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ సీక్వెల్ 'జైలర్ 2' షూటింగ్ శరవేగంగా జరుగుతున్న సంగతి తెలిసిందే. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో సన్ పిక్చర్స్ భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్న ఈ క్రేజీ ప్రాజెక్ట్ ఇప్పటికే 90 శాతం షూటింగ్ పూర్తి చేసుకుని చివరి దశకు చేరుకుంది. ఇక ఈ సినిమాకు సంబంధించిన డిజిటల్, శాటిలైట్ రైట్స్ కోసం దిగ్గజ ఓటీటీ సంస్థల మధ్య పోటీ నెలకొంది. ఈ సీక్వెల్‌లో బాలీవుడ్ గ్రీక్ గాడ్ హృతిక్ రోషన్ ఒక పవర్‌ఫుల్ క్యామియో రోల్‌లో సందడి చేయనున్నాడు. వచ్చే వారం నుంచి హృతిక్ పార్ట్ షూటింగ్‌ను ప్లాన్ చేశారు. అన్నీ అనుకున్నట్లు జరిగితే 'జైలర్ 2'ను దీపావళి కానుకగా ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా రిలీజ్ చేయాలని మేకర్స్ భావిస్తున్నారు. అధికారిక ప్రకటన త్వరలోనే రానుంది. ఇదిలా ఉంటే నటుడు ధనుష్ కూడా అదే దీపావళి రేసులోకి దిగేందుకు సిద్ధమవుతున్నట్లు కోలీవుడ్ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. ధనుష్ కెరీర్‌లో 55వ చిత్రంగా 'అమరన్' ఫేమ్ రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌పై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమాలో మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి కీలక పాత్ర పోషిస్తుండగా, స్టార్ హీరోయిన్లు సాయి పల్లవి, శ్రీలీల కథానాయికలుగా నటిస్తున్నారు. పాన్ ఇండియా లెవెల్లో భారీ తారాగణంతో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని కూడా దీపావళికే రిలీజ్ చేసే యోచనలో నిర్మాతలు ఉన్నారు. ప్రస్తుతం రెండు టీమ్స్ పోస్ట్ ప్రొడక్షన్ పనులు, చివరి షెడ్యూల్ షూటింగ్స్‌తో బిజీగా ఉన్నాయి. ఒకవైపు రజనీకాంత్ క్రేజ్, మరోవైపు ధనుష్ కంటెంట్.. దీంతో ఈ దీపావళికి కోలీవుడ్ బాక్సాఫీస్ వద్ద గట్టి పోటీ ఖాయమని ట్రేడ్ పండితులు అంచనా వేస్తున్నారు. మరి ఈ క్లాష్‌లో ఎవరు పైచేయి సాధిస్తారో చూడాలి.



## పంద్రాగస్ట్‌కు విడుదల కానున్న బట్వారా 1947




బాలీవుడ్ యాక్షన్ స్టార్ సన్నీ డియోల్ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ హిస్టారికల్ డ్రామా 'బట్వారా 1947' నుంచి క్రేజీ అప్‌డేట్ వచ్చింది. తాజాగా ఈ సినిమా నుంచి టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. దేశ విభజన నాటి భయానక పరిస్థితులు, ద్వేషం మధ్య ఒక వ్యక్తి చూపించిన అసాధారణ ధైర్యం నేపథ్యంలో సాగే భావోద్వేగభరిత చిత్రంగా ఈ చిత్రం రాబోతున్నట్లు టీజర్‌ను చూస్తే అర్థమవుతుంది. ఇక ఈ చిత్రాన్ని స్వాతంత్య్ర దినోత్సవ కానుకగా ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది. గతంలో 'ఘాయల్', 'దామిని', 'ఘాతక్' వంటి ఇండస్ట్రీ హిట్లను అందించిన స్టార్ డైరెక్టర్ రాజ్‌కుమార్ సంతోషి, సన్నీ డియోల్ కాంబినేషన్‌లో చాలా ఏళ్ల తర్వాత వస్తున్న సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను మిస్టర్ పర్ఫెక్ట్ ఆమిర్ ఖాన్ తన 'ఆమిర్ ఖాన్ ప్రొడక్షన్స్' బ్యానర్‌పై అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తుం డటం విశేషం. ఈ చిత్రంలో సన్నీ డియోల్ సరసన సీనియర్ స్టార్ హీరోయిన్ ప్రీతి జింతా నటిస్తుండగా, శబానా అజ్మీ, అలీ ఫజల్, కరణ్ డియోల్, కనికా కపూర్, సర్గమ్ సింగ్, ఖుషీ హజారే కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఆస్కార్ గ్రహీత ఎ.ఆర్. రెహమాన్ ఈ చిత్రానికి అద్భుతమైన సంగీతాన్ని అందిస్తున్నారు.



## వైభవ్ సూర్యవంశీకి బిసిసిఐ ఆఫర్

**తల్లిదండ్రులతో ఇంగ్లండ్ పర్యటనకు అనుమతి**



ముంబై,జూన్ 18 భారత క్రికెట్‌లో నయా సంచలనంగా ఎదుగుతున్న వైభవ్ సూర్యవంశీకి భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ప్రత్యేక వెసులుబాటు కల్పించింది. ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనలకు ఎంపికైన ఈ యువ బ్యాటర్‌తో పాటు అతడి తల్లిదండ్రులనూ అనుమతించింది. వారి ప్రయాణ, వసతి ఖర్చులన్నింటినీ తామే భరిస్తామని బీసీసీఐ స్పష్టం చేసింది. ఈ విషయాన్ని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా ధ్రువీకరించారు. కేవలం 15 ఏళ్ల వయసులోనే జాతీయ జట్టులో చోటు దక్కించుకున్న వైభవ్.. సీనియర్ ఆటగాళ్ల మధ్య సౌకర్యంగా ఉండేందుకే ఈ నిర్ణయం తీసుకున్నామ న్నారు. 'జాతీయ జట్టులో 14-15 ఏళ్ల ఆటగాడు ఉండటం చాలా అరుదు. గతంలో సచిన్ టెండూల్కర్ లాంటి ఆటగాడు చిన్న వయసులోనే భారత జట్టులోకి వచ్చాడు. ఇప్పుడు వైభవ్ కూడా అలాంటి ప్రత్యేక పరిస్థితుల్లో ఉన్నాడు. అక్కడి కొత్త వాతావరణ పరిస్థితులకు అతడు అలవాటుపడేందుకు తల్లిదండ్రుల సాన్నిహిత్యం ఉపయోగపడుతుంది' అని సైకియా వివరించారు. ఐపీఎల్ సీజన్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచిన వైభవ్.. 776 పరుగులతో ఆరెంజ్ క్యాప్ సొంతం చేసుకున్నాడు. అంతేకాకుండా 237కు పైగా స్ట్రైక్‌రేట్‌తో బ్యాటింగ్ చేసి మోస్ట్ వ్యాల్యూబుల్ ప్లేయర్, ఎమర్జింగ్ ప్లేయర్ అవార్డులనూ సొంతం చేసుకున్నాడీ చిచ్చర పిడుగు. అతడి అద్భుత ఆటతీరును గుర్తించిన బీసీసీఐ.. భారత టీ20 జట్టులో అవకాశం కల్పించింది. కాగా.. దీనికంటే ముందు శ్రీలంకలో ప్రస్తుతం జరుగుతున్న ముక్కోణపు వన్డే సిరీస్‌లో భారత్-ఏ తరపున ప్రాతినిధ్యం వహిస్తున్నాడు వైభవ్.

## బీహార్‌లో మరో చిచ్చర పిడుగు

**క్రికెట్‌లో అద్భుతంగా రాణించిన అక్షరగుప్తా**

పాట్నా,జూన్ 18 వైభవ్ సూర్యవంశీ 13 ఏళ్లకే ఐపీఎల్ కాంట్రాక్ట్ దక్కించుకుని క్రికెట్ ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురిచేశాడు. బిహార్‌కు చెందిన ఈ కుర్రాడు రాజస్థాన్ రాయల్స్ తరఫున గత రెండు సీజన్లలో పరుగుల వరద పారించి ఎన్నో రికార్డులు బ్రేక్ చేశాడు. ఈ ప్రదర్శనతో భారత టీ20 జట్టులోనూ చోటు సంపాదించుకున్నాడు. ఇప్పుడు అదే రాష్ట్రం నుంచి మరో టీనేజీ సంచలనం వెలుగులోకి వచ్చింది. అక్షర గుప్తా అనే అమ్మాయి ఓ మ్యాచ్‌లో 126 బంతుల్లోనే 242.86 స్ట్రయిక్ రేట్‌తో 306 పరుగులు చేసి అజేయంగా నిలిచింది. 16 బంతుల్లోనే హాఫ్ సెంచరీ, 34 బంతుల్లో సెంచరీ చేసింది. మొత్తం 55 ఫోర్లు, ఎనిమిది సిక్సర్లు బాది వార్తల్లో నిలిచింది. బిహార్ క్రికెట్ అసోసియేషన్ మహిళల అండర్-19 వన్డే ట్రోఫీ టోర్నమెంట్‌లో అక్షర గుప్తా ఈ సంచలన ఇన్నింగ్స్ నమోదు చేసింది. 15 ఏళ్ల అక్షర తూర్పు చంపారన్ జిల్లా రక్సాల్ అనే పట్టణంలో పుట్టి పెరిగింది. 14 ఏళ్ల వయసులోనే అండర్-19 మహిళల జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించింది. బిహార్ తరపున రెండేళ్ల వ్యవధిలో వరుసగా నాలుగు బీసీసీఐ మహిళా టోర్నమెంట్లు ఆడిన తొలి మహిళా క్రికెటర్‌గా నిలిచింది. సంచలన ఇన్నింగ్స్ ఆడిన అక్షంకు బిహార్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు హర్షవర్ధన్ అభినందనలు తెలిపారు. బిహార్ మహిళా క్రికెటర్లు తమ ప్రదర్శనల ద్వారా రాష్ట్రానికి నిరంతరం కీర్తిని తెస్తున్నారని పేర్కొన్నారు. క్రీడాకా రులకు మెరుగైన అవకాశాలు కల్పించేందుకు బీసీఏ నిరంతరం కృషి చేస్తోందని,ఇలాంటిఇన్నింగ్స్‌లుయువక్రికెటర్లకు స్ఫూర్తినిస్తాయన్నారు.

## ఫిఫా ప్రపంచకప్ 2026లో పోర్చుగల్ జట్టుకు ఊహించని షాక్

**ఆధిక్యతను అడ్డుకున్న కాంగో జట్టు**

న్యూఢిల్లీ,జూన్ 18 ఫిఫా ప్రపంచకప్ 2026లో బలమైన పోర్చుగల్ జట్టుకు ఊహించని షాక్ తగిలింది. హ్యూస్టన్‌లోని ఎన్ఆర్జీ స్టేడియంలో జరిగిన గ్రూప్-కె మ్యాచ్‌లో డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో(డీఆర్ కాంగో) జట్టు 1-1తో పోర్చుగల్‌ను నిలువరించింది. మ్యాచ్‌పై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించినప్పటికీ, కాంగో పటిష్ఠ రక్షణ శ్రేణిని ఛేదించడంలో పోర్చుగల్ విఫలమైంది. మ్యాచ్ ప్రారంభమైన 6వ నిమిషంలోనే పోర్చుగల్ ఆటగాడు జోనో నెవ్స్ అద్భుతమైన ఫీల్డ్ గోల్‌తో జట్టుకు 1-0 ఆధిక్యాన్ని అందించాడు. అయితే, డిఫెండర్ విభాగాన్ని పటిష్ఠం చేసుకున్న కాంగో ఎదురుదాడికి దిగింది. ఈ క్రమంలో 44వ నిమిషంలో కాంగో స్టార్ యోనే విస్సా హెడర్ ద్వారా బంతిని నెట్‌లోకి పంపి స్కోరును 1-1తో సమం చేశాడు. రెండో అర్ధ భాగంలో పోర్చుగల్ బంతిని ఎక్కువసేపు తమ ఆధీనంలో ఉంచుకున్నప్పటికీ గోల్స్ చేయలేకపోయింది.

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Telangana. Printed at SUPHALA AKSHARAM Printers, RNI ref.no PRESS/2026/126/7878/00001375, e-mail: aksharamnewsts@gmail.com, Editor: SHAIK YACOOB PASHA, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609